ఓ౩మ్

సు విజ్ఞానం చికితుషే జనాయ
సచ్చాసచ్చ వచసీ పస్పృధాతే ।
తయోర్ యత్ సత్యం యతరద్ ఋజీయః
తదిత్ సోమో అవతి హన్త్యాసత్ ॥

(ఋ. 7.104.12. అథర్వ. 8.4.12

ఉత్తమ విశేష జ్ఞానము నెరుగగోరు మానవుల యెదుట సత్యము, అసత్యము ఒక దానితో నొకటి పోటీ పడుచు నిలుచును. ఆ రెంటి యందు ఏది సత్యమో, ఏది కపట రహితమో దాని ననుసరించు మానవులు పరమేశ్వర రక్షణను పొంది పరమశాంతి నొందుదురు. అసత్ జ్ఞానము ననుసరించు వారు సంసార సముద్రమున మాటిమాటికి చంపబడుచు దుఃఖముల పాలగుదురు.

గాన సత్యము నెఱుగ ప్రయత్నింతుము రండు.

గాయత్రీ గ్రంథమాల - 19
ప్రతులు : 2,000

సృష్టి సంవత్సరము : 197,29,49.692
దయానందాబ్దము : 166
ప్రజోత్పత్తి, విజయదశమి, 1991

మూల్యము : రు. 15-00
(పోష్టు ఖర్చులు అదనము)

ప్రతులకు :
గాయత్రీ ఆశ్రమము
12-10-586/6, వ్యాస్‌నగర్,
సీతాఫల్‌మండి, సికింద్రాబాద్ - 500 361

ముద్రణ :
అమర్‌నాథ్ ప్రింటర్స్,
సీతాఫల్‌మండి, సికింద్రాబాద్

సుఖముల నందగోరుచున్నాడు. దానివల్ల కొన్ని సుఖములు పొంద గలిగినను అంతకుమించి అశాంతియే యెదురగుచున్నది. భౌతిక విజ్ఞానము పెరుగు కొలది మానవ జీవితము క్రమక్రమముగా భయాందోళనలతో దుర్భరమగుచున్నది. ఇదే భౌతిక విజ్ఞానము వలన మనము సాధించిన ఫలము.

క్రాంతదర్శులైన ప్రాచీన ఋషులు ముందు చూపుతో భౌతిక విజ్ఞానము వలన కలుగు అనిష్టమును ముందే గుర్తించి పరమ శాంతి నిచ్చు ఆధ్యాత్మిక విజ్ఞానమునకు పెద్దపీట వేసిరి. అట్లని వారు భౌతిక విజ్ఞానమును విస్మరించలేదు. మన జీవన నిర్వహణ కవసరమైనంత వరకు దానిని కూడా వృద్ధిపరచిరి. వైద్య, వాస్తు, యంత్ర, విమానాది శాస్త్రముల నెన్నింటినో నిర్మించిరి. వీటిని మించి ఆధ్యాత్మిక క్షేత్రమున విస్తృత శాస్త్రముల నిర్మించిరి. యోగసాధనతో పరమానంద స్పర్శను పొంది పరమ శాంతిని పొందిరి. వారు వృద్ధిపరచిన ఆధ్యాత్మిక జ్ఞానము బ్రాహ్మణ, ఆరణ్యక, దర్శన, ఉపనిషదాది గ్రంథములందు కాననగను. అదియే మానవులకు నిజమైన సుఖ శాంతులను ప్రసాదించును.

విధి వైపరీత్యము వలన మహాభారత యుద్ధానంతరము క్రమముగా ఐశ్వర్యముతో బాటు ఆధ్యాత్మిక జ్ఞానము లోపించుచు విదేశీ మత సంస్కారములతో కూడిన సాంప్రదాయక మత మతాంతరములు వ్యాప్తి జెందినవి. వైజ్ఞానికమైన వేద సంస్కృతి స్థానములో అవైజ్ఞానికమైన పురాణ సంస్కృతి రాజ్య మేలుచున్నది. అది విద్యావంతులను, విజ్ఞానవేత్తలను కూడ తన వశమున పెట్టుకొని వికటాట్టహాసము చేయుచున్నది. దాని చెరనుండి మానవజాతి విముక్తి పొందునా ? యనియు సందేహము కలుగుచున్నది.

తైన అనువాద గ్రంథములు మరెన్నియో గలవు. అన్నిటిని మేము ప్రచురించలేకపోయినను మేము కోరిన వెంటనే యీ గ్రంథమును మా కొసంగి మమ్ము ధన్యుల జేసిరి. పాతఅల్వాల వాస్తవ్యులు శ్రీ గుండాల రామారావుగారు మేము కోరిన వేంటనే దీని ముద్రణా వ్యయము నొసగి మమ్ము ప్రోత్సహించినందున తొందరలోనే ప్రచురించ గలిగితిమి. 'స్త్రీల కొరకు ఒక మంచి పుస్తకము ప్రచురించవలె'నను మా చిరకాల వాంఛ నేటికి కార్యరూపమును ధరించి యీ పుస్తక రూపమున మీ ముందుకు వచ్చినది. రచయితలకు, అనుకర్తలకు, దాతలకు మా హృదయపూర్వక ధన్యవాదములు. చక్కగా అక్షరములు కూర్చిన శ్రీ దక్షిణామూర్తి గారికి, అందముగా అచ్చువేసిన శ్రీ పాండు గారికి మా శుభాకాంక్షలు. మా ముందు ప్రచురణల వలెనే ఆంధ్ర పాఠకులు దీనిని గూడా ఆదరించి బహుళ ప్రచారము చేసి స్త్రీలలో జ్ఞాన బీజముల నాటుటకు ప్రయత్నము చేసినచో మా అందరి కృషి సఫలము కాగలదు.

— కోడూరి సుబ్బారావు

"యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్ర దేవతాః"

నప్పుడు మౌనముగ నుందురు. ఈ పుస్తక మీ లోటును తీర్చగలదని భావింపబడుచున్నది.

స్త్రీలు, బాలికల వలెనే పురుషులు, బాలురును ఈ పుస్తక మందలి విషయముల నవగాహన మొనర్చుకొనినచో వైదిక ధర్మ సిద్ధాంతముల ప్రచారము సమున్నతముగ జరుగగలదు. కావున బాల బాలిక లెల్లరును ఈ గ్రంథమును సమాదరించి ధర్మ ప్రచారమున సహకరించగలరని ఆశించబడుచున్నది.

కాస్‌గంజ్ (ఏటా) ఉత్తరప్రదేశ్ వాస్తవ్యులు ఆచార్య డాక్టర్ శ్రీరాం ఆర్యగారు **'మాతా పుత్రియోంకా సంవాద్'** అను పుస్తకమును ప్రశ్నోత్తర రూపమున వ్రాసినారు. తెలుగు సోదర సోదరీమణులకు అత్యంతోపయుక్తముగ నుండునని యెంచి దీనిని "మాతా పుత్రికల జ్ఞాన చర్చ" యను పేరుతో తెలుగులోని కనువ దించితిని. పాత్రల నామములు మాత్రము తెలుగు భాష కనువుగ నుండునట్లు మార్చబడినవి. పాఠకు లీ స్వల్ప భేదమును గ్రహింతురు గాక ! దీనిని సవరించి యిచ్చిన నా చిరుసహోదరుడు, వీతరాగి శ్రీ లోకా లక్ష్మినారాయణ (మనస్వి) గారికి నా ఆశీర్వాదపూర్వక ధన్యవాదములు.

దీనికి ముద్రణ భాగ్యము గలిగించిన ఉదార ద్రవ్యదాతలకు దయామయుడగు పరమేశ్వరుడు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసా దించు గాక. ఇందులకు సఫల ప్రయత్నము నొనర్చిన వైదిక సేవా తత్పరులగు డా॥ కోడూరి సుబ్బారావు ఆర్య, వ్యాస్‌నగర్, సీతాఫల మండి గారికి గాయత్రీ ఆశ్రమ ట్రస్టు కార్యవర్గమునకు నా కృతజ్ఞతాభి వందనములు.

ఇట్లు
వైదిక ధర్మానురాగి
లోకా మల్హరి సిద్ధాంతాచార్య
ఇందూరు (నిజామాబాద్)

1991

వ్యవసాయ. పశుపోషణతో పాటు పెద ్రకమముగా మిలటరీ సివిల్ కంట్రాక్టులు చేయుచు స్వయంకృషితో ఆర్థిక పుష్టిని పొందిరి.

ఈ దంపతులకు ప్రథమ సంతానముగా నొక కుమార్తె, తర్వాత వరుసగా నలుగురు కుమారులు కలిగిరి. కుమార్తెయైన శ్రీమతి కాంతమ్మగారికి (70 సం॥లు). కూకట్‌పల్లి వాస్తవ్యులు శ్రీ భీమరావు గారితో వివాహమైనది. కుమారులలో పెద్దవారు శ్రీ రామారావు గారు (60 సం॥లు) వీరికి శ్రీమతి కమలమ్మ గారితోను, రెండవ కుమారుడైన శ్రీ దామోదర్‌రావుగారికి శ్రీమతి లక్ష్మమ్మగారితోను, మూడవ కుమారుడైన శ్రీ శ్రీపతిరావు గారికి శ్రీమతి మంగమ్మ గారితోను, నాల్గవ కుమారుడైన శ్రీ రఘుపతిరావుగారికి శ్రీమతి ఆనందబాయి గారితోను వివాహములైనవి. వీరందరు పుత్ర పౌత్రాదులతో సుఖ సంతోషములతో యిప్పటికిని అవిభక్త కుటుంబముగా నున్నారు. నేటి కాలములో యిది విశేషమే.

పెద్ద కుమారుడైన శ్రీ రామారావు గారు తండ్రిగారి వలె సాత్విక స్వభావము గలవారు మిత మధురభాషి. ఆడంబరములకు పోవువారు గారు. సాధు సన్యాసులపైన, విద్వాంసుల పైన అపారశ్రద్ధ గలవారు. వారితో సత్సంగములు చేయుచుందురు. వీరు మహర్షి దయానంద ప్రదర్శిత వైదిక ధర్మము పట్ల ఆకర్షితులై పూజ్యపండిత గోపదేశశాస్త్రిగారి ప్రవచన శ్రవణము ద్వారా తమ జ్ఞానాన్ని వృద్ధి పరచుకొనుచు, స్వాధ్యాయము చేయుచు, నిత్యము సంధ్యాగ్నిహోత్రముల జేయుచు, కుటుంబ బాధ్యతలను తమ్ములకు, కుమారులకు అప్పగించి వానప్రస్థుల వలె ధార్మిక జీవనము గడుపుచున్నారు. ఒక ఆర్యకన్యా గురుకులమును వ్యవస్థీకరించవలెనను కోరిక గలవారు. వైదికధర్మ ప్రచారాభిలాషి. మేము కోరిన వెంటనే యీ పుస్తక ముద్రణ వ్యయము భరించి మాకెంతగానో సహకరించిరి. వీరికి, వీరి కుటుంబమునకు పరమేశ్వరుడు దీర్ఘ ఆయురారోగ్య ఐశ్వర్యముల నిచ్చి కాపాడును గాక !

1. ప్రశ్న : వీణాదేవి :- అమ్మా ! ఈ కాలమున ప్రపంచమునందనేక మత సాంప్రదాయములు స్థిరపడియున్నవి. ఎల్లరును తమ మతమే సత్యమని, ఇతరులది మిథ్యయని యందురు. ఇట్టి పరస్పర విరుద్ధ సాంప్రదాయముల కారణమున మానవ సమాజమున అశాంతి, వైషమ్యములు, కలహములు అతిగా పెరిగిపోవుచున్నవి. దీనివల్ల మానవ జాతి కెంతయో హానిగలుగుచున్నది. భిన్నములైన పరస్పర విరుద్ధ సిద్ధాంతములు, ఆలోచనలు గల ఈ ధర్మవిరుద్ధ ప్రవాహము నరికట్ట వీలగునా ?

ఉత్తరము : అన్నపూర్ణ :- బిడ్డా! నీవడిగినది కడు ఉత్తమమైన ప్రశ్న. వాస్తవముగ ధర్మ మొక్కటే. విభిన్న మతము లనునవి సాంప్రదాయములు మాత్రమే. ప్రతిమతము ఏదో యొక వ్యక్తి ద్వార ప్రారంభింప బడినదే. ఆవ్యక్తి తన బుద్ధికి తోచినట్లు ఈశ్వరుడు, ఆతని యుపాసన విషయమున తన భక్తుల కుపదేశించి ఒక సాంప్రదాయమును ప్రారంభించును. ఆతని యా భావప్రవాహమున శ్రద్ధ గలవారెల్లరును ప్రవహించగా దేశమున నొక నవీన సాంప్రదాయము ప్రారంభమగును మానవు డల్పజ్ఞుడగుటవలన ఆతనిద్వార స్థాపిత మగు సాంప్రదాయము మిథ్యాకల్పనలపై ఆధారపడి యుండును. ఈ కారణమువలననే విభిన్న సాంప్రదాయములందు అభిప్రాయ భేదములు అత్యధికముగనే యుండును. ఇక ధర్మమునకు సంబంధము పరమాత్మతో నుండును. కేవలము పరమాత్మయే సర్వదా సత్యము, నిర్భ్రాంతమైన తత్త్వము ఆతడిచ్చిన వేదజ్ఞానము గూడ నిర్భ్రాంతమే. కావున వేదధర్మమే సత్యసనాతన మానవధర్మము. దాని వల్లనే విశ్వకల్యాణము జరుగగలదు. మానవులెల్లరును పక్షపాత, దురాగ్రహములను త్యజించి వేదాధ్యయన మొనర్చుచు అది చూపిన సత్యమార్గమున నడచినచో సాంప్రదాయక మతభేదములు సమాప్తమై

నాలుకకు రుచి, చర్మమునకు స్పర్శ, నాసికకు గంధము, కర్ణములకు శబ్దము వంటి శక్తిని ప్రసాదించినాడు. ఈ యైదు జ్ఞానేంద్రియములు కేవలము పంచభూతములచే నిర్మితమైన స్థూలపదార్థముల గుణములను మాత్రమే తెలిసికొనగలవు. పరమాత్మ మరియు జీవాత్మ యను నీరెండును పంచభూతములకు భిన్నమైన అభౌతిక పదార్థములు. ఈ యైదు జ్ఞానేంద్రియములు పరమాత్మను గ్రహించి తెలిసికొనజాలవు. కావుననే పరమేశ్వరుడు అగోచరుడని యనబడును. జీవాత్మ తన యంతఃకరణమున పరమాత్మానుభూతిని పొందగలదు.

చూడమ్మా : ప్రపంచమందలి ప్రతి పదార్థములో జ్ఞానపూర్వక నియమపూర్వక నిర్మాణ ముండును. మానవులద్వారా, ఇతర జీవుల ద్వారా నిర్మాణము కుమ్మరి కుండలను జేయునట్లు వెలుపలినుండి జరుగును. కాని ప్రకృతియందు పదార్థముల నిర్మాణము లోపలి నుండియే జరుగుటను చూచుచుందుము. ఆ పదార్థములందు నిర్మాత వ్యాపకుడై యుండి రచన నొనర్చును. వెలుపలనుండి పదార్థముల నిర్మాణము జరుగుచోట కర్త నిర్మాణ పదార్థములకు వేరై యుండును. కర్త ప్రత్యక్షముగ నున్నను, అప్రత్యక్షముగ నున్నను నియమము నియామకుని ఉనికికి ప్రమాణము. కార్యము కర్తకు ప్రమాణము. ఈ విశ్వమందు ప్రతి అణువునందును ప్రతిక్షణము విజ్ఞానపూర్వకముగ జరుపుచుండు క్రియ దానియందు వ్యాపించియున్న కర్తయగు పరమేశ్వరుని ఉనికికి ప్రత్యక్ష ప్రమాణము. ఇట్లు పరమాత్ముని యస్తిత్వ జ్ఞానము ప్రతి జ్ఞానవంతుడు గలిగి యుండునని నీ కిప్పుడు తెలిసి యుండును. ఈ కార్యక్షేత్రములందు లోపలినుండి జరుగు రచన పరమాత్మునిదే. జీవులద్వార రచన వెలుపలినుండియే జరుగును.. విశ్వమున ఎంత గొప్ప విద్వాంసుడైనను ఒక వేప ఆకునుగూడ

వస్తువెంత పెద్దదైనను అది ఆకాశమునందొక పరిమిత స్థానముననే ఆబద్ధమై యుండగలదు. అట్లైన యాకాశము పరమాత్మునికన్న పెద్దదైపోగలదు. వైశాల్యమునందు పరమాత్ముడు చిన్నవాడగును. ప్రతి సాకార వస్తువుగూడ పరిమితమైనది. దాని శక్తి, జ్ఞానముకూడ పరిమితమైనవే. పరిమిత జ్ఞానవంతుడు సర్వజ్ఞుడు గాజాలడు. ఈయనంత విశాల విశ్వమునందలి ప్రతి పరమాణువు నందును ప్రతి క్షణము జరుగుచుండు జ్ఞానపూర్వకమగు సృష్టి మరియు క్రియలను పరిమిత జ్ఞానవంతుడు చేయజాలడు. ఈ విశ్వవ్యాపక, జ్ఞానపూర్వక, వైజ్ఞానిక నియమముల ఆధారమున జరుగుచున్న క్రియయే పరమాత్మ ఒక అనంత శక్తియని, నిరాకార సత్తాయిని తెలుపుచున్నది. ఒకే స్థానమందుండువాడు సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, విశ్వవ్యాపకు డెట్లగును ? అతులితుడు, అనుపముడు గూడ గాజాలడు. కావుననే పరమాత్ముడు ఏకదేశీయుడు, ఏకస్థానమునం దుండువాడని భావించు కల్పన మిథ్యయే.

4. ప్ర. హంసవేణి :- అమ్మా ! కొందరు "ఆత్మ, పరమాత్మ యనున దొక్కటే. జీవాత్మ పరమాత్మయొక్క అంశము మాత్రమే. జీవాత్మయే పరమాత్మయందు గలిసి పరమాత్మయై పోవు"నని యందురు. జీవాత్మ ముక్తుడై పరమాత్మ యగుననియును, 'పర మాత్మ' యనున దొక ఉన్నతస్థానము (పదవి). దానిని ప్రాప్తించు కొనినవాడే 'పరమాత్మ' యని మరికొంద రందురు. ఇందేది నిజము ?

ఉ :- ఏదియును గాదు. జీవాత్మ పరమాత్మ ఒక్కటే అను వారి వాదన సత్యదూరము, నిరాధారము. జీవాత్మ అల్పజ్ఞుడు, ఏక దేశీయుడు. జనన మరణచక్రమున భ్రమించు అనాది చేతనశక్తి పరమాత్ముడు సర్వవ్యాపకుడు, చైతన్యుడు, సర్వజ్ఞుడు, సర్వాధారుడు,

నొందగలదు గదా ! అంశమునందేదేని వికారము జరిగినచో దాని పూర్ణమందును అట్టి వికారము తప్పక జరుగగలదు. ఖండమగు కారణమున పరమాత్మయొక్క వికారము నొప్పుకొనవలసి వచ్చును. సంయోగ వియోగ గుణములుగల వస్తువులనే ఖండములుగ నొనర్చుట కవకాశ ముండును. పదార్థముల, పరమాణువుల సంయోగమువల్ల నిర్మాణమగు వానికే ఖండములగుట కవకాశముగలదు. కాని ఏకమై యుండి సంయోగ వియోగములు లేనట్టి ఆత్మ మరియు పరమాత్మలు ఖండములు గాజాలవు. ఈ కారణముననే జీవాత్మను పరమాత్మ యంశమని నమ్మజాలము. ఈరెంటిని ఒక్కటిగా నిరూపించుటకు వీని గుణములుగూడ ఒక్కటిగా లేవు. కావున ఆత్మ పరమాత్మలు భిన్నములే.

ఇక పోతే; పరమాత్మ ఒక పదవి. ముక్తి నొందిన జీవులు ఆ పదవిని పొంది పరమాత్మ అగుదురని విశ్వసించు వారును పెద మార్గమునందే యున్నారని యనవలెను. ఈ రెండు శక్తులు భిన్నమే యైనప్పుడు పదవి (స్థానము) అను మాట మిథ్యయే కాగలదు. ముక్తి నొందిన యనంతరము జీవాత్మ పరమాత్మల సంబంధము అగ్ని యందు కాలిన లోహము అగ్ని రూపమును దాల్చినట్లే యుండును. కాని యీ రెండింటి శక్తులు అగ్ని మరియు లోహము వలెనే వేర్వేరై యుండును. జీవాత్మ ముక్తుడై తన యస్తిత్వమును కోల్పోయి స్వనాశనమును జేసికొనడు. ఒకవేళ అట్లు నష్టమగుచో ఆతడు పొందవలసిన ముక్త్యానందము నెవరు పొందగలరు ?

౫. ప్ర : తల్లీ ! పరమాత్మ నిరాకారుడగుచో ఈ యింద్రియముల ద్వారా ఆతని గ్రహించజాలకున్నచో ఆతనిని పొందు టెట్లు ?

ఆనందముతో పరమాత్మ యనుభూతిని పొందగలడు. ఈశ్వరుడు ఆత్మానుభూతికి విషయము మాత్రమే. ఋషి మునులెల్లరును నేత్రములను మూసికొని భౌతిక జగత్తుతో ఇంద్రియముల సంబంధమును త్రెంచివేసి సమాధిస్థులై పరమాత్మ ధ్యానమొనర్చుచుండిరి. ఈశ్వరుడు "చిన్తన్నవాధ్యాన" వస్తువై యున్నాడు. వైదిక ధర్మమున దర్శన, శ్రవణ, గ్రంథాధ్యయ నాదులకును, పరమాత్మ ధ్యానమున కేమాత్రమును సంబంధము లేదు. నమాజు చేయుట, హారతి యిచ్చుట, గ్రంథములను చదువుట, మంత్రములను జపించుట, మూర్తులను దర్శించుట మున్నగు విషయములతో ధ్యానమున కేలాటి సంబంధము నుండదు. ధ్యానము ఏకాంతమున కూర్చుండి, నిశ్చింతుడై ఏకాగ్రతతో నభ్యసించిన సిద్ధించును. దర్శనము, పూజలు మున్నగు వానితోనే పరమాత్మ ప్రాప్తికి సంబంధముండినచో బ్రహ్మయజ్ఞధారులగు సమస్త వైదిక ఋషులు ఏకాంతవాసమున సమాధివంటి కఠిన పరిశ్రమ నేల జేయుచుండిరో మీరు చక్కగా నాలోచించిన తెలిసికొనగలరు.

మూర్తుల దర్శనమునే పరమేశ్వరుని దర్శనమని ఎంచువారును ఎంతో మోసపోవుచున్నారని యనవచ్చును. ఎవరి 'దర్శనము' - నిరాకార, సర్వవ్యాపక పరమాత్మునిదా? లేక భౌతికమూర్తులదా? మూర్తి యనునది ఒకప్పుడుండి ఇప్పుడు లేనట్టి ఒక మానవాకృతికి ప్రతి రూపము. నిరాకారుడు, సర్వవ్యాపకుడగు పరమేశ్వరునికి ఎట్టి యాకృతియు లేనందున అతని మూర్తి యుండుననుట అవాస్తవము. మన నేత్రములు కేవలము పరమేశ్వరునితో ఎట్టి సంబంధము లేని భౌతికమూర్తి యొక్క ఆకృతి, రూపు, వర్ణము, వస్త్రాభూషణాదులు, సౌందర్యము మున్నగు వానినే జూచుచుండును. ఏల యన, పరమాత్ముడు రూప రస గంధాదుల కతీతుడు. కావున భౌతిక ఇంద్రియములతో అతని జూడజాలము.

6. ప్ర. వీణ : మూర్తిపూజ ప్రారంభ సోపానమనియు, అభ్యాస మైన పిదప సాధకుడు నిరాకారుడగు పరమేశ్వరునే ఉపాసించగల డనియు కొందరనునది సత్యము గాదా ?

ఉ : సాధన కొరకు మూర్తిపూజ సాధకునకు సాధకము గాక బాధకమే యగును. మూర్తిపూజకుడు జీవితమంతయును ప్రతిమల పూజలనే చేయుచు అంతకన్న ముందుకు సాగలేడు. 'సోపానము'లను దాని భావము యమనియమములు. అనగా "అహింస, సత్యము, అస్తేయము (చౌర్యము చేయకుండుట), బ్రహ్మచర్యము, అపరిగ్రహము (నిధుల సంగ్రహవృత్తి లేకుండుట) అను నీ యైదును యమములు; "శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అను నీ యైదును నియమములు. వీనిని అభ్యసించుచుండవలెను. "యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ధారణ, ధ్యాన, సమాధు" లను నవి ఈశ్వరోపాసనకు, ఆతని సాక్షాత్కారమునకు సర్వోత్తమమైన సోపానములు. యోగదర్శనమునందు వీని వర్ణన అతి విపులముగ గలదు. శాస్త్రోక్తమైన, యోగీశ్వరుల అనుభవసిద్ధమైన ఈ యోగము ఈశ్వర సాక్షాత్కారమునకు అత్యుత్తమమైన మార్గము. మిగతావన్నియు మానవుల మిథ్యాకల్పనలే. మన పూర్వులగు ఋషులు, మహర్షులెల్లరును ధ్యానావస్థితులై సాధన నొనర్చుచుండిరి. కాని మూర్తిపూజలు చేయలేదని మన ప్రాచీన శాస్త్రాదులు, ఇతిహాస సాహిత్యముల వల్ల స్పష్టమగుచున్నది.

8. ప్ర. వీణ : పరమేశ్వరుడు మూర్తులందును వ్యాపకమై యున్నాడు గదా ! విగ్రహారాధన, విగ్రహోపాసనల నొనర్చుట వల్ల పరమాత్ముని పూజ, ఉపాసనలు జరిగినట్లేల విశ్వసించరాదు ?

ఉ : పరమాత్మ సర్వవ్యాపకుడగు కారణమున విగ్రహము లందును వ్యాపకుడై యున్నాడనుట యథార్థమే. ఐనను, మూర్తులందు

ఉ: బిడ్డా! ఈశ్వరు డనాది గదా! ఆతని గుణములు కూడ అనాదియే. నిరాకారత్వము పరమాత్ముని నిత్య అనాది గుణము. పరివర్తన గుణములు గల గుణీ లేక పదార్థము నాశవంతమగు చుండును. ఈ సంపూర్ణాకాశమును ఎవ్వరైన ఒకచో కూర్చి, మడత చేసి ఒక కుండలో బంధించగలరా? అట్లు చేయలేనప్పుడు విశ్వవ్యాప్తి యగు పరమాత్మ ఏకదేశ, అత్యల్ప మానవ శరీరమందు జేరగలడా? ఏకదేశీయ పదార్థములందే 'రాకపోకలు' అను కార్యము జరుగు చుండును. కాని సదా సర్వవ్యాపకుడై యున్న భగవంతుని రాకపోకలు అవతారములు ఎట్లు సంభవమగును? నీ విచ్చట నున్నప్పుడు మరొక చోట నుండజాలవు. ఇంకెచ్చటనో ఉన్నప్పుడు ఇచ్చట నుండలేవు. ఇదేవిధముగా పరమాత్మ అవతారమెత్తి ఒక్కచోటికి చేరినచో విశ్వమందలి ఇతర స్థలము లందెచ్చటను ఉండజాలడు. అట్లగుచో అతడు సర్వాధారుడు, సర్వవ్యాపకు డెట్లగును? మరొక విషయము - నిర్మాణముకన్న వినాశమే సులభముగ జరుగును. ఏదేని యొక నిర్మాణము జరుగునప్పుడు దానికి వ్యయమగునంత శక్తి దాని నిర్మూలనమున కవసరముండదు. విశ్వాధారుడు. సర్వశక్తిమంతుడగు పరమేశ్వరుడు చేయలేని పని యేదైన గలదా? రావణుడు, కంసుడు మొదలగు తుచ్ఛ మానవులను వారి హృదయగతి నాపివేసి చంపివేయజాలడా? వారిని చంపుటకు జన్మముల నెత్తవలసివచ్చునా? వారెల్లరును జన్మతః తమ పూర్వజన్మ కర్మఫలయోగము ముగియగనే స్వయముగ మరణింతురు గదా? ఈ కారణమున 'అవతారము లెత్తుట' యను మాట స్వయముగనే వ్యర్థమగుచున్నది. తుచ్ఛుడగు ఒక మానవుని చంపుట యనునది ఈ యనంత విశ్వసృష్టి, స్థితి, లయముల నొనర్చ గల మహాప్రభువునకు కఠినమైన విషయమా?

10. ప్ర. వీణ: అమ్మా! నిరాకారుడగు పరమేశ్వరుడు శరీ

మూల ఫల పుష్పాది సకల పదార్థముల నుత్పన్న మొనర్చినాడు. అవదల నుండి అతడే మనలను కాపాడుచుండును. మనకు మన కర్మానుసారము ఫలముల నిచ్చుచుండును. ఇంతటి మహోన్నతమైన ఉపకారి యొక్క అనేక ఉపకారములతో మనము యావజ్జీవము లాభము నొందుచున్నాము. అట్టిచో ఆతని ప్రార్థన మొనర్చకుండుట కృతఘ్నత గాక మరేమగును ?

'స్తుతి' యనగా పరమాత్ముని గుణములను, ఉపకారములను ప్రేమపూర్వక శ్రద్ధతో వర్ణించుచు స్మరించుచుండుటయే. ఇందువల్ల మనకు పరమాత్మునిపై ప్రీత్యాకర్షణ ఉత్పన్నమగును. సాధకుడు తన్మయుడై నప్పుడు పరమాత్మునకు, తనకు మధ్య ఏమాత్రము అంత రము లేనట్లు అనుభూతిని పొందగలడు. ఏకాగ్రత యొక్క ఈ స్థితి వల్ల జీవాత్మయందు పరమేశ్వరుని ఈ దివ్య గుణములు వచ్చి చేరు చుండును. ఉపాసన యనగా సమీపమునకు చేరుట. అగ్ని సామీప్యమున ఉష్ణము, సజ్జనుని సామీప్యముచే సద్గుణములు, దుష్టుని సామీప్యము వల్ల జీవనమున దుర్గుణములు ప్రవేశించినట్లే పరమాత్ముని ఉపాసన వల్ల జీవనమున సద్గుణములు ప్రవేశించును. సాధకుని యాత్మబలము, శక్తి, నిర్భయత, పవిత్రత, స్ఫూర్తి, జ్ఞానము మొదలగు ఉత్తమ గుణములచే పూర్ణమగును. ఉపాసన వల్ల ఆతని మస్తిష్కమున వికాసము వంటి అనేక సద్గుణములు ప్రాప్తించును. క్రమముగ నాతని ప్రార్థనకు స్థిత రూపము వచ్చును.

ప్రార్థన యనగా వేడుట, యాచించుట. యాచించుట వల్ల సాధకుని యందుండు గర్వము, ఆత్మాభిమానము తొలగిపోయి దాని స్థానమున నమ్రత వచ్చి చేరును. ఇట్లు స్తుతి, ప్రార్థన, ఉపాసన యను నీ మూడును మానవునకు ఆత్మకల్యాణ సాధనములే. దీనిని పొగడ్త,

పరమాత్ముడు అమృత స్వరూపుడు, ప్రకాశ స్వరూపుడు. ఆతని మాహాత్మ్యము అసీమితము, అనంతమునై యున్నది. అనంతమున వ్యాప్తుడై యున్నందున ఆతడును అనంతుడే.

14. ప్ర. హంస: అమ్మా! మా విద్యాలయమున కొక శాస్త్రి గారు వచ్చి తన ప్రవచనమున "వేదములందు పరమాత్ముడు అవతారము లెత్తినట్లు వ్రాసియున్నదని చెప్పి యజుర్వేదమందలి ఈ మంత్రములను వినిపించినారు.

ఓం ప్రజాపతి శ్చరతి గర్భే అన్తరజాయమానో
బహుధా వి జాయతే।
తస్య యోనిం పరి పశ్యన్తి ధీరా స్తస్మిన్
హ తస్థు ర్భువనాని విశ్వా॥ యజు. 31.16

ఓం ఏషో హ దేవః ప్రదిశోఽను సర్వాః
పూర్వో హ జాతః స ఉ గర్భే అన్తః।
స ఏవ జాతః స జనిష్యమాణః
ప్రత్యఙ్ జనా స్తిష్ఠతి సర్వతో ముఖః॥ య. 32.4

ఈ వేద మంత్రముల యాధారమున పరమాత్ముడు గర్భమునకు వచ్చునని, జన్మమెత్తునని తెలిపినారు. మీ యుద్దేశ్య మేమి?

ఉ: బిడ్డా! శాస్త్రిగారు వేద మంత్రముల అర్థమును తప్పుగా జేసి తెలిపినారు. ఇందు మొదటి మంత్రము యొక్క అర్థమేమన: "పరమాత్మ (గర్భేఅన్తం) అంతఃకరణ మధ్యమున అనేక విధములుగ ప్రకటితమగును. యోగ సమాధ్యవస్థయందు పరమేశ్వరుని యానంద రూపము యొక్క అనుభూతిని తన అంతఃకరణమున పొందును. విద్వజ్జనులు ఆతని (యోనిమ్) స్వరూపమును కార్యరూప సృష్టిని

ఉ: ఏ పదార్థ మెట్లుండునో దానియందదే భావన గలిగి యుండుట సత్యభావన యగును. అందుకు విపరీతమగు భావన మిథ్యయే యగును. బెల్లమును బెల్లముగా భావించిన అది సత్యముగ నుండును. విషము నందమృత భావన యుంచిన నది మిథ్యభావన యగును. ఇదే విధముగ పరమాత్మ యందు ఆతని గుణకర్మ స్వభావాది గుణముల కనుగుణముగ భావన యొనర్చిన సరిగా నుండగలదు. పరమాత్మ యందు తన పుత్రభావన, జడమునందు చైతన్య భావన, చైతన్యము నందు జడభావన, మూర్ఖుని యందు పాండిత్య భావన మున్నగున వన్నియును మిథ్యయే యగును. పరమాత్మ నిత్యుడు, నిరాకారుడు. అట్టిచో ఆతనియందు సాకార భావన నొనర్చుట, పాషాణ ప్రతిమ యందు పరమాత్మ భావనజేసి దానినుండి సౌఖ్యములు, ధనధాన్యములు పుత్రాదులను కాంక్షించుట మిథ్యభావన యగునే కాని లాభ మేమాత్రము నుండదు. ఏల యన, జడమూర్తులందు కోరికలను ప్రసాదించు శక్తి ఉండజాలదు.

16 ప్ర. వీణ: పరమేశ్వరుని న్యాయకారి, దయాళువని యందురు గదా? ఈ రెండు గుణము లొక్కచోట ఎట్లుండగలవు? ఒకవేళ నాతడు అత్యాచారుల యెడ దయగలిగి యుండిన న్యాయకారి యెట్లగును? ఇక న్యాయకారియైనచో దయాళువు కాడు గదా?

ఉ: న్యాయము, దయ అను వానియందు కేవలము శాబ్దిక భేదమే గాని, అర్థ భేద మేమియును లేదు. కర్మానుసారము యథావిధిగ దండించిన నది న్యాయమేయగును. అట్టి దండన ద్వారా ప్రాణిని పాప కర్మల ప్రవృత్తి నుండి కాపాడి ఆతనిని సంస్కరించుట, ఆతనికి ఉత్తమ కార్యము లొనర్చుట కవకాశమును గలిగించుట. అట్టి దండము ద్వారా ఆతని యత్యాచారముల నుండి ఇతరులను గాపాడుటయును

గూడ సంభవమై యుండును. ఉత్పత్తి యగుదాని వినాశము తప్పక జరుగును. "జాతస్య మరణం ధ్రువమ్, జాతస్య హి ధ్రువో మృత్యుః" "యద్దృశ్యం తన్నశ్యతి" మళ్ళీ మొదటి ప్రశ్నయే. అనగా 'పరమాత్మ జీవాత్మలను దేనితో ఎందుల కుత్పన్న మొనర్చినా"డను సంశయము గలుగును. ఈ జటిల ప్రశ్నకు సమాధానము కేవలము వైదిక ధర్మము గాక ఇతర మతములు, సాంప్రదాయముల ద్వార సంభవము గాదు.

పూర్వము నుండియే ఏదో చైతన్య శక్తి (సత్త) విద్యమానమై యుండకున్నచో పరమాత్మ డీ జగత్తును, జీవాత్మలను తన కొరకే సృష్టించుకొనినాడా ? అట్లేఅని నమ్మినచో పరమాత్మ అపూర్ణుడగును. ఏల యన, అవసరములు అపూర్ణునకే యుండును. కాని పరమాత్మ పరిపూర్ణుడు. అతడు జగత్తును జీవాత్మల హితమునకే ఉత్పత్తి యొనర్చినాడని నమ్మవలసియే యుండును. ఇట్లు నమ్ముటచే గలుగు మాన్యత నిర్దోషముగ నుండును. ఏల యన, ఈ జగత్ప్రవాహము అనాది. ఒక నిశ్చితావధియందు జగద్రచన చేయుచుండును.

18. ప్ర. పీణ : పరమాత్మ డీ ప్రపంచమును మాటిమాటికి సృష్టించుచు ప్రళయ మొనర్చుచుండుట కంటె సదా నాశము చెంద కుండనుండు ప్రపంచమును సృష్టించినచో ఏ బాదరబందీ లేకుండా నిశ్చింతగ నుండును గదా ? అట్లేల జేయడు ?

ఉ : చూడమ్మా ! నిర్మింపబడిన ప్రతి పదార్థము గూడా నిశ్చితావధి తరువాత నిశ్చయముగ నాశమగుచుండును. గృహములు, కుండలు, ప్రాణులు, వృక్షములు మున్నగునవన్నియు ఉత్పన్నమై నష్టమగుచున్నవి. దీని కారణ మేమన- పరమాణువుల సంయోగమువల్ల ఉత్పన్నమగు వస్తువులు ఒక నిశ్చిత సమయము వరకుండు సామర్థ్యము గలిగియుండును. పిదప వానియందు విఘటన క్రియ ప్రారంభ

వచ్చుచున్నది. అనంత కాలము వరకు నడచుచునే యుండగలదు. సృష్టి, ఉత్పత్తి, ప్రళయముల రహస్య మిదియే.

19. ప్ర. హంస : ఈ జగత్తు మరియు సృష్టి అనాది. దీని నెవ్వరును ఎప్పుడును చేయలేదు. అనాదినుండి యున్నది. ఉండగలదు. దీనియందు బాహ్య పరివర్తనము గలుగుచుండును. సంపూర్ణ సృష్టి మరియు జగత్తు ఎప్పుడును వినాశము నొందదని కొంద రందురు. మీ రేమందురు ?

ఉ : ఇట్లు విశ్వసించు వారి యాలోచనలు శుద్ధమైనవి గావు. 'జగత్తు' అను పదమున కర్థమిట్లు గలదు. జ- ఉత్పన్నమగునది, గత్- నాశనమగునది— అనగా, ఉత్పన్నమై నష్టమగునది. కావుననే ఈ ప్రపంచమును 'జగత్' అనుచున్నాము. ఇట్లే 'సృష్టి' అను శబ్దమున కర్థము గూడ ఉత్పన్నమగునది. దాని పేరులోనే ఇవన్నియు నుత్పన్నమగునవనియు సిద్ధమగుచున్నప్పుడు ఇక దానిని 'అనాది' అని యెట్లనవచ్చును ? 'విశ్వ' శబ్దమునకును వి- వియోగము, శ్వ- భవిష్యత్‌లో అగునది అని యర్థము. అనగా భవిష్యత్‌లో నష్టమగు నది. కావుననే ఈ ప్రపంచమును 'విశ్వ'మని యందుము.

ఇక వినుము— ఏ పదార్థమునందు సంయోగ వియోగము లుండునో దానిని 'కార్యము' లేక 'చేయబడినది' అని యందుము. ఏల యన, రెండు వేర్వేరు పదార్థముల పరమాణువుల సంయోగము ఏదో కాల విశేషమున జరుగును. సంయోగము జరిగినప్పటి నుండి ఆ పదార్థము యొక్క ఉత్పత్తి నంగీకరింతుము. ఉత్పత్తి జరిగినప్పుడు దాని వియోగము, వినాశము గూడా ఒకానొకప్పు డవశ్యకముగా జరుగును గదా ! జన్మించిన దాని మృత్యువు తప్పక జరుగును. మన మీ విశ్వమందు జూచుచున్న పృథివ్యాది లోకములందు పరమాణువుల

ఉ : పాక్షిక ప్రళయ కాలమున పృథివి, సూర్య చంద్రాది లోకములు విఘటన మొందిన పిదప వానియందలి అతి కఠోర పాషాణ ధాతు మిశ్రిత కఠినాంశ శిలాఖండములు, శేషించిన అంశములు, పరమాణువులుగ విడిపోకుండ ఉండిన భాగములు, ఉల్కాలు మొదలగునవి ఆకాశమున చెల్లాచెదురుగ వ్యాపించిపోవును. ఇక పృథివ్యాది లోకముల నిర్మాణము జరిగినప్పుడు అవియన్నియును ఇతర లోకముల వలె ఆకాశమున భ్రమణ మొనర్చుచుండును. అప్పుడప్పుడవి పరస్పరము ఢీకొనుటచే వానినుండి మెరుపు పుట్టును. దానినే మనము 'చుక్క తెగి పడుట' అని యందుము. ఈ ఢీకొనుటలో ఆ విశాల ఖండములు పూర్తిగా నశించిపోవును. అనేక పర్యాయములు తెగిన భాగాంశము లనేకములు మన పృథివిపై గూడ పడుచుండును. వానియందు ఇనుము, రాగి, శిలలు మున్నగువాని మిశ్రమముండుట చూడబడినది.

21. ప్ర. వీణ : అమ్మా ! ఒక శరీరమును వదలిన పిమ్మట జీవాత్మ కెంతకాలమునకు పునర్జన్మ లభించగలదు ?

ఉ : దాని కర్మఫలము ననుసరించి తక్షణము లేక కొన్ని దినములు, నెలలు, సంవత్సరములు లేక ఇంకెంతైన కాలము పట్టవచ్చును. ఈ విషయమున విద్వాంసుల కనేక అభిప్రాయములు గలవు గర్భమునందు పిండములో కొందరు మూడు మాసములకు, కొందరు ఐదు మాసములకు, మరికొందరు ప్రారంభము నుండియే జీవాత్మ ప్రవేశించుచుండునని తలచుచున్నారు. కాని నా యభిమత మేమన, రజో వీర్యముల జీవిత జీవాణువుల కలయికచే గర్భము నిలుచును. తరువాత మాతా గర్భమున 48 గంటలవర కవి పరిపాకమగును. ఆ పిదప దానినుండి వెంద్రుక వంటి నాళమొకటి యేర్పడి తల్లి శరీరముతో సంబద్ధమై పోవును. అప్పటి నుండియే గర్భము (పిండము) మాత శరీరాంశముగ మారును. తల్లియొక్క జీవాత్మ శక్తి దానియందు

22. ప్ర. వీణ : మనుష్యుని ఆత్మకు పశు పక్ష్యాదుల యోనులందు రాకపోకలు జరుగుచుండునా ?

ఉ : ఔను. కర్మఫల భోగములకై జీవాత్మ విభిన్న యోనులందును జన్మ నొందవలసి యుండును. దాని పాపకర్మ లధికమై పుణ్యకర్మలు న్యూనమై యుండునంత వరకు అవశ్యముగ నది అన్య నిమ్న యోనులను పొందుచుండును. ఒకవేళ పాపకర్మలు సమానములైనను, పాపకర్మల కన్న పుణ్యకర్మ లధికమై యున్నను అది మానవ యోనులను పొందగలుగుచున్నది. ఇది యంతయును దాని పుణ్య పాప కర్మలపై ఆధారపడి యుండును.

23. ప్ర. హంస : విభిన్న యోనులందు జీవులకు జన్మనిచ్చుట వల్ల వాని సంస్కారము (సుధారణ) ఎట్లు సంభవమగును ?

ఉ : జీవాత్మ మానవ శరీరము నందున్నప్పుడు ఏ యింద్రియముల ద్వారా పాపకర్మల నొనర్చుట కలవాటు పడియుండునో అన్య యోను లందట్టి ఇంద్రియములు వాని కీయబడవు. ఏల యన, ఆ యింద్రియములు లభించనందువల్ల జీవాత్మకు అట్టి పాపకర్మలు జేయు అలవాటు నశించును. దాని కా విధముగా సంస్కారము జరుగును మనుష్యుడు యితరులతో దుర్వ్యవహారములు జరిపిన విధముగనే

న్నారు, ఆ విధముగా గర్భములో పెరిగిన బిడ్డలు తెలివితేటలలో అఖండు లవుతారని ప్రసూత వైద్య నిపుణురాలు డాక్టర్ రానేవన్ దేకర్ అంటున్నారు. మరి గర్భస్థ శిశువులో జీవాత్మ ప్రవేశించకున్న యిది ఎట్లు సాధ్యము ? కెనడాకు చెందిన ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు థామస్ వెర్నే రచించిన "The Secret of the Unborned Child" అనే పరిశోధన గ్రంథంలో ఇంకెన్నో వివరములు కనబడును.

క్షముగా శిక్షను తప్పించుకొనుటకే యత్నింతురు. ఐతే అనేక కష్టము లకు నిలయమగు నీచ యోనులను స్వయముగా ఎవ్వరు కోరుకుందురు? పరాధీనత వల్లనే దండన లభించును. లభించిన శిక్ష నవి అనుభవించ వలసియే యుండును. "కర్మలే స్వయముగా ఫలముల ననుభవింప జేయు"నని నమ్ముటయును సరియైనది గాదు. ఈ నమ్మకములతో ఇంకొక లోప మేమనగా- అధికమత్తు అలవాటు గల వానికి కొద్దిపాటి మత్తు ఏమియు జేయలేదు. అనభ్యాసికి కొద్దిపాటి మత్తుయే అధిక ప్రభావమును గలిగించునట్లే కొద్ది పాపముల నొనర్చిన వారికి సూక్ష్మ (తేలిక) శిక్షయును గొప్పగానే అనుభవము గలుగును. నిజమగు న్యాయమేమన కర్మలమాత్ర ననుసరించి మనుష్యులకు యథాతథముగ న్యాయాధీశుడు దండన విధించునట్లే పరమేశ్వరుడును యథారీతిగ జీవులకు కర్మఫలభోగ వ్యవస్థ నొనర్చుచుండును.

మొదటి దినము, మొదటి యధ్యాయము సమాప్తము

ద్వితీయాధ్యాయము

నేడు రెండవ దినము. ప్రాతఃకాలముననే స్నాన సంధ్య యజ్ఞాది కృత్యములను దీర్చుకొని శ్రీమతి అన్నపూర్ణాదేవి తన కూతుళ్ళు వీణాదేవి, హంసవేణిలతో సహా గత దిన నిశ్చయానుసారము స్వాధ్యాయ మందిరమున ఎదురెదురుగ తమ తమ ఆసనములపై గూర్చుండిరి. అప్పుడు తల్లి కూతుళ్ళతో "అమ్మాయిలూ! ఇక మీ శంకలను ప్రవేశపెట్టు"డని యనగా ఈ దిగువ విధముగా సంభాషణ మారంభమైనది.

వైజ్ఞానిక ప్రక్రియయునై యున్నది. మన భారతదేశము నందీ మృతక సంస్కారమును అంత్యేష్టి లేక నరమేధ యజ్ఞమనియు అందురు. ఇది మానవ జీవితమందలి షోడశ సంస్కారములందు చివరి పదహారవ ప్రక్రియయై యున్నది.

27. ప్ర. హంస : అనేక జనులు శవములను నదులు మున్నగు జలములందు ప్రవహింపజేయుదురు. దీనియందలి హాని లాభము లేమి? ఇట్లు జేయుట వల్ల జలచర జంతువుల కడుపులు నిండును గదా ?

ఉ : జలములందు శవములను ప్రవహింపజేయుట వల్ల అవి కుళ్ళిపోయి దుర్గంధయుక్తమై ప్రాణుల ఆరోగ్యమును పాడుచేయగలవు. జలములనగా జీవనము. అనేక ప్రాణులు జలములను త్రావి జీవించు చుండును. ఈ దూషిత జలసేవన మొనర్చుట, అందు స్నానాదుల నొనర్చుట మున్నగు వానిచే హానియే గలుగుచుండును. కావున జలము లందు శవములను వదలుట పాపకర్మయే యగును.

28. ప్ర. హంస : చిన్నపిల్లల శవములను దహన మొనర్చు టకు మారుగ పాతిపెట్టు ప్రథ ఎందు కేర్పడినది ? మహాత్ముల శవము లను గూడ సమాధియే చేయుదురేల ?

ఉ : ఇదియును అజ్ఞాన కారణముననే జరుగుచున్నది. పిన్న, పెద్దల, సామాన్యుల, మహాపురుషుల శరీరము లన్నియు పాంచభౌతిక నిర్మాణములే. కావున నా యన్నిటికిని దహన సంస్కారమే జరుగ వలసియుండును. ఖనన మొనర్చుట హానికారకము, అవైదిక ప్రథయు నగును. ముస్లిములు, క్రైస్తవులు మున్నగు విధర్మీయుల ననుక రించుచు ఆర్య హిందూ సమాజమందును ఈ యవైజ్ఞానిక ప్రథ వ్యాపించుచుండుట శోచనీయము.

రెండవ జన్మకు పోవును గదా! లోకులు మరణించిన వారి పేర శ్రాద్ధ తర్పణము లేల యొనర్చెదరు ?

ఉ : బిడ్డా! శ్రాద్ధము, తర్పణములను వాని అర్థములు వేర్వే రుగా నున్నవి. శ్రద్ధాపూర్వకముగా నిచ్చు దానిని శ్రాద్ధమనియు, అట్లు శ్రద్ధాపూర్వకము నర్పించు దానిని గైకొను నాతడు సంపూర్ణముగ తృప్తి జెందువర కిచ్చు దానిని తర్పణ మనియు అందురు.

చనిపోయిన తరువాత మనము శ్రద్ధాపూర్వకముగా నివ్వదలచిన దానిని తీసికొనుటకు వారుండరు గనుక మరణించిన వారి ఆత్మలను సంతుష్టి పరచలేము. ఇంతేగాక మరణించిన ప్రాణుల యాత్మల ఆచూకి, జాడ, పోబడికూడ తెలిసిన గదా! మనమేమైన పంపుటకు ? కావున శ్రాద్ధ తర్పణములు మరణించిన వారి పేరున ఎంతమాత్రమును జరుగగూడదు. ఇది కేవలము జీవితులై యున్న పితరులకు- అనగా పోషకులు, తల్లిదండ్రులు, గురుజనులు, వృద్ధులు, విద్వాంసులు, విశేషజ్ఞులు, వైజ్ఞానికులు, రక్షకులు, పెద్దలు మున్నగువారికి. వారు తృప్తిపడు నంతవరకు శ్రద్ధాపూర్వకముగా సంతృప్తి పరచుటయే శ్రాద్ధము, తర్పణము. తృప్తులైన వారు శ్రాద్ధ తర్పణము లొనర్చు దాతల కల్యాణ కాంక్షతో వారి హితమునకై ఆశీర్వాదముల నిచ్చు చుందురు. కావున జీవించియున్న వారిని శ్రద్ధతో తృప్తిపరచుటయే శ్రాద్ధ తర్పణము లనబడును.

32. ప్ర. హంస : "శ్రాద్ధ సమయమున మృతక పురుషుల ఆత్మలు వచ్చి శ్రాద్ధ భోక్తలగు మా శరీరములందు నిలిచి మాతోబాటు భుజించి తృప్తి నొందుదు"రని మన పండితులు చెప్పుచుందురు. అది యెంతవరకు నిజము ?

వందల సంవత్సరముల లోపు కాలమునందే ప్రారంభించబడినది. ఇది ప్రాచీన సాంప్రదాయము గాదు. ముస్లిములు తమ ప్రేతల పేర్లతో గోరీలపై తినుబండారముల నుంచి 'ఫాతెహా'ను చదువుచుండిరి. దానినే పీ రనుకరించుచు 'శ్రాద్ధ'మను ప్రథను నడిపినారు. అదియైనను భాద్రపద మాసమందలి ఒక పక్షమున కేవల మొక్క దినముననే జరుపబడును. మిగతా ౩౬4 దినములు శ్రాద్ధము నొనర్చని వారు తమ పితరులను అకలి దప్పులతో చచ్చుటకు వదలివేయుదురు. వేసవి గ్రీష్మ ఋతువులందు ప్రచండ ఉష్ణ తాపమున వీరిచ్చుట ప్రతి దినము అతి శీతలమగు మంచు, లస్సీ, లేమన్, ఐస్‌క్రీములు మున్నగు వానితో తమ తాపము దీర్చుకొనుచు తమ మృత పితరులకు కొన్ని నీళ్లైనను త్రావించరు. భాద్రపద వర్షర్తువులందు సర్వ ప్రదేశములు జలమయమై మేఘములు జలసమృద్ధములై యున్నప్పుడును తమ పితరులకు రెండు పుడిశిళ్ల జలము పోయుట పరిహాసము గాదా! లోకు లెట్టి పరిహాస కార్యము లొనర్చుచున్నారో మీరే యాలోచించుడు. శ్రాద్ధమున లభించిన భోజనములు, వస్తువులు మృతాత్మలకు చేరినట్లు పండితుల వారచ్చట నుండి రసీదేమైనా దెచ్చి యిత్తురా? బిడ్డా! ఇవన్నియు అంధవిశ్వాసములు. ముస్లిముల అనుకరణతో ప్రారంభించబడిన ప్రథలు మాత్రమే. ఇది వైదిక ధర్మము కానేకాదు.

జీవించియున్న మాతా పితరులు మున్నగు పెద్దల నేమాత్రమును సత్కరించక వారి నెంతగానో అవమానపరచి వేళకింత తిండి పెట్టక నానా అగచాట్లకు గురిజేసి మరణించిన పిదప వారి యస్థికలను గంగా జలమున నిమజ్జన మొనర్చి శ్రాద్ధ తర్పణము లొనర్తురు. ఇట్టి వారిపై ఈ క్రింది పద్యము చరితార్థ మగుచున్నది.

"జియత్ పితా సే దంగాదంగా, మరేపితా పహుంచాయే గంగా"

లభించును. కాని ఒకరు చేసిన కర్మలకు ఫలము మరొకరికి లభించదు సంతానము జేయు మృతక శ్రాద్ధములతో మృతుల యాత్మల సద్గతుల దుర్గతులకు సంబంధ మేమాత్రము నుండదు. ఇంటియందలి స్త్రీలు తల బాదుకొనుచు దుఃఖించుచుందురు. ఇంటి లోపలి భాగముననో, బంగళా పైననో లోకులు హాయిగ పెద్దకర్మ మృతక భోజన మొనర్చుచుందురు. ఇట్టి ఏడ్పులార్పులతో గూడిన భోజన మెట్లు చేయుదుమా ? యను సంకోచము గూడ వారి కుండదు. నేటి కాలమున లక్షలాది జ్ఞానవంతులు ఇట్టి పెద్దకర్మ కార్యమును, భోజనాదులను నిషేధించినారు. అనేక సంఘములు, పంచాయితీలు జేసి ఈ కుప్రథను దొలగించినవి, ఈ దురాచార మెంత శీఘ్రముగ దొలగిపోయిన నంత మంచిది.

34. మృతక శ్రాద్ధముల జేయించు పండితులకు కొన్ని ప్రశ్నలు.

1. 'పితరులు' అను నామవాచకము మృతులకు వర్తించునా, జీవితులకా ? ఒకవేళ జీవితులకే యగుచో 'మృతకశ్రాద్ధ' మనునది వృథాయే యగును గదా ! అట్లుగాక మృతులకు సంబంధించినచో "ఆధత్తపితరో గర్భం కుమారం పుష్కరస్రజమ్" (య. 2-33), "ఊర్జం వహన్తీ రమృతం ఘృతం పయః కీలాలం పరిస్రుతమ్ । స్వధా స్థ తర్పయత మే పితౄన్ ॥ (య. 2-34), "ఆయన్తు నః పితరః సోమ్యాసోఽగ్నిష్వాత్తాః పథిభిర్దేవయానైః (యజు. 17-68). ఇట్టి వేద మంత్రములలో పితరులు గర్భాదాన మొనర్చుట, అన్న పానీయాదులు సేవించుట, రాకపోకలు, మాట్లాడుట వంటి క్రియ లొనర్చు వారలని తెలుపబడినది. ఇట్టి వన్నియును మృతులకు సంభవము గావు. దీనివల్ల 'పితరు'లను నామవాచకము జీవితులకే వర్తించును. కావున మృతులకు శ్రాద్ధము లొనర్చుట అవైదికము.

లను గ్రహించలేదు. అగుచో మీ పితరులు భోజనము లెట్లొనర్చెదరు?

9. శ్రాద్ధములం దొసగిన భోజనము పునర్జన్మ నెత్తిన జీవుల స్వభావముల కనుగుణ్యమగునది గాకున్నచో శ్రాద్ధ మొనర్చిన నేమి లాభము ?

10. ఒక పితరుని నలుగురు కుమారులు నాలుగు వేర్వేరు నగరము లందుండి ఒకే దినమున, ఒకే సమయమున శ్రాద్ధ మొనర్చినచో నాతని యాత్మ నాలుగు స్థానములకు శ్రాద్ధమును గ్రహించుట కెట్లు పోగలదు ? ఏల యన, ఏక దేశీయ జీవి ఒకే సమయమునం దొకే స్థానమున విద్యమానమై యుండును గదా !

11. సకల జాతుల వారికిని శ్రాద్ధాధికార మేల లేదు ?

12 శ్రాద్ధాధికారము లేని జాతుల వారి పితరులు ఆకలి దప్పులచే మరణించుచుందురు. లేదా ఇతరుల పదార్థములను లాగుకొని తినుచుందురు. అట్టి సమయములందు వారికి తగవులు, పోరాటములు జరిగిన వాని నెవరు, ఎట్లు శాంతపరచెదరు ? మరణించిన తరువాత గూడ జీవులందు ఉచ్ఛ నీచ భేదములను పాటించుచుండునని నమ్ముట కాధార మేమి ?

13. మరణించిన పిదప చిరునామా గూడ యుండని జీవాత్మలకు శ్రాద్ధమునందలి వస్తు చయమును పురోహితుడు పితరులకు చేరవేయుటకు ఏదైన ప్రమాణ మున్నదా ?

14. జాడగూడ దెలియరాని శరీర రహిత జీవాత్మల వద్దకు పదార్థముల నందించుటను నీ వొప్పుకొనినప్పుడు సజీవులుగా నుండి పరదేశము లందున్న నీ వారి పేరున భోజన పదార్థముల పళ్ళెరము

పురాణ పాఠకుడు నగు బ్రాహ్మణులను యజ్ఞ దానములు మరియు శ్రాద్ధములందు పిలువవలదని, అట్లు పిలుచువాని దానఫలము నష్టమై శ్రాద్ధ మొనర్చిన వారి పితరులు ఘోర నరకమునకు చేరగల" రనియును వ్రాయబడియున్నది. దీనికి మీ రేమందురు? ఉపరోక్త కర్మ లొనర్చుట, పురాణమును చదువుట మున్నగునవి మహాపాప కర్మలు. అట్లు చేయువారు మహా పాపులని యెంచబడినది. వీరిని శ్రాద్ధాదులందు పిలిచిన పాపము శ్రాద్ధకర్త ద్వార యొనర్చబడుచున్నది. ఐతే అట్టి కుకర్మ ఫలము పితరులు ఎందుకు అనుభవించవలసి వచ్చును?

19. గీతా ప్రెస్సు వారి మహాభారత వనపర్వము అ, 183 శ్లో. 77 నందు

"ఆయుషోఽన్తే ప్రహాదేవ క్షీణప్రాయః కలేబరమ్ ।
సంభవత్యేవ యుగపద్ యోనౌ నాస్త్యంతరాభవః ॥

మ.భా. వనపర్వ. 183-77

అని గలదు. "అనగా, జీవు డొక శరీరమును విడిచి తక్షణమే మరొక శరీరమును గ్రహించును, అతడు స్థూల శరీరాశ్రయము లేక ఒక్క క్షణమైనను ఉండజాలడు" అని వ్రాయబడి యున్నది. గీత 2-22 గూడ జీవుని తక్షణ పునర్జన్మమును బలపరచుచున్నది. అట్లగుచో పునర్జన్మను పొందిన జీవుల కొరకు శ్రాద్ధ మొనర్చుట మిథ్యాకర్మ యేల కాగూడదు? ఏల యన, జన్మించిన బాలకులు, వయస్కు లెవ్వరికిని తమ పూర్వజన్మ స్థానములం దీయబడుచుండు శ్రాద్ధ పదార్థములు చేరకుండుట ప్రత్యక్షమే గదా!

20. 'పితరులు' అను పేరు జీవాత్మకా? శరీరమునకా? అట్లుగాక సజీవ శరీరమునకా? ఒకవేళ జీవాత్మకే యైన మరణించిన తరువాత సంబంధము సమాప్తమై పోవుచున్నది. శరీరముతో సంబంధ

ఉ : సంపూర్ణముగా మిథ్యయే. నిజముగా కట్టుకథ లందు సత్యమేమియు నుండదు. చతురు లగువారు అమాయకులను భూత ప్రేతాదుల పేరుతో భయపెట్టి వారినుండి ధనము ను పొందుచుందురు అమాయకులు మస్తిష్క వ్యాధులను వ్యాధులని యోచక భూత ప్రేతాదుల యాక్రమణమని నమ్మి కూర్చుందురు. ఇట్టి రోగు లనేకుల మరణము ఈ భ్రాంతి కారణముననే గలుగుచున్నది. ఆలోచించుడు, జీవాత్మ నిరాకారము, సూక్ష్మమై యుండినను ఇంత గొప్ప స్థూలము, శక్తిగల శరీర మను సాధనము లేక స్వయముగ నేమియును జేయుటకు సమర్థమైనది గాదు. ఇక నది శరీరమును వదలిన పిమ్మట భౌతిక సాధన (శరీరము) లేక ఏమియును చేయజాలదు. ఎవ్వరితో నేమి యును చెప్పజాలదు. పోట్లాడజాలదు. ఒక గడ్డిపోచ నైనను గదల్ప జాలదు. ఇట్టి స్థితి యందది లోకులకు హాని లాభముల నెట్లు గలిగించ గలదు ?

37. ప్ర. వీణ : కొందరు అంజనము (ప్లేన్‌చిట్-Plan chit) మొదలగు వానివల్ల మృతుని యాత్మ వచ్చి మాట్లాడి పోవుచుండునని యనుచుందురు. ఇది మిథ్యయేనా ?

ఉ : నే నీ క్రియను స్వయముగ ఆచరించి చూచితిని. ఇందు కార్యము నొనర్చువారు తమ మనఃశక్తితో హస్తాగ్ర భాగములతో ప్రభావితుల నొనర్చి 'అంజనము' వేసి వారి మస్తిష్కము యొక్క చేతనా శక్తిని అంజనము- Plan chit ద్వారా ప్రభావిత మొనర్చి పని చేయించుచుందురు. ఇందు మరొకచోటి నుండి ఆత్మ వచ్చి పని చేయదు. మనోవిజ్ఞానము యొక్క ఈ రహస్యము నెరుగజాలని వారు భూత ప్రేతాదుల భ్రమయందు బడిపోవుదురు. చిన్ననాటి నుండియే భూత ప్రేతాదుల కల్పిత కథలను వినిపించుచు జననీ జనకులు బాలురను భయపెట్టుచుందురు. అట్టి విషయములే వారి మస్తిష్కము

38. ప్ర. వీణ : అమ్మా ! అపస్మారము (హిస్టీరియా) అను రోగము అతి క్రూరమైనది. స్త్రీల ననేకులను ఎంతో కాలము నుండి అనేక విధములుగ బాధించి వ్యాకుల పెట్టుట నే నెరుగుదును. పాపమా స్త్రీలకు ఆ వ్యాధి తెరలు రాగానే నిలుచున్నవారు నిలుచున్నట్లే పడి పోవుచుందురు. వంట చేయునప్పుడు కొందరకు తెరలు వచ్చి పొయ్యి నిప్పులలో బడి మరణించినట్లు వినుచున్నాము. ఎంత గొప్ప ఉపచారము లొనర్చినను ఈ వ్యాధి నివారణ గాదు, ఈ రోగమున కిక సరియగు చికిత్సలే లేవా ?

ఉ : ఈ వ్యాధి స్త్రీ రోగులకు అతి హానికరము, దుఃఖదాయక మునై యున్నది. కొందరు స్త్రీలకు సంతానమైన తరువాత ఈ వ్యాధి స్వయముగనే తొలగిపోవుచున్నది. ప్రతి వైద్యుడును ఈ వ్యాధికి చికిత్స చేయజాలడు. నా అనుభవము నందీ వ్యాధికి ఈ దిగువ ఔషధములు సర్వోత్తమముగా నెంచబడినవి.

'స్మృతిదా' అను పేరు గల ఆయుర్వేద సూదిమందు ప్రతి మూడు దినముల కొకటి చొప్పున కండరములకు ఇంజిక్షన్ చేయించు కొనినచో వ్యాధి నివారణ యగును. బహుశః ఒకటి రెండు సూదుల లోనే లాభము గలుగగలదు.

మరొక ఔషధము : 'సచేతనీవటి' యను ఆయుర్వేద ఔషధము లభించును. అందు పాషాణ భస్మము గూడ చేరియుండును. పిత్త ప్రధాన ప్రకృతిగాని స్త్రీలకు దినమునకు మూడు పర్యాయములు ప్రతి దినము ఇచ్చుచున్న హిస్టీరియా వ్యాధి శీఘ్రముగ నివారణ యగును. ఈ రోగమున కీ యౌషధము అనేకులపై పరీక్షింపబడినది.

39. ప్ర. వీణ : అమ్మా ! మీ రిప్పుడీ రోగులకు చక్కని చికిత్సను సూచించితిరి. మహిళా లోకమున కెంతయో మేలు జరుగ

యుండెను. 'శివుడు' ఈతని భూతనాథు డనియు అందురు. 'భూత జాతి' యను శబ్దము అపభ్రంశ రూపమున భూతియా లేక భోటియా యైనది. భూతముల స్థానము 'భూతస్థాన్'కు బదులు 'భూటాన్' యైనది. భూత స్థానమునకు శివుడు రాజు. భూతాన్ రాజు యొక్క ఉపాధి శివుడు లేక భూతనాథుడు. ఆ పీఠము నధిష్ఠించు వారెల్లరు 'శివు'డని పిలువబడుచుండిరి. ఇక పౌరాణికులు మానస సరోవరము చుట్టుప్రక్కల భూభాగపు రాజును 'విష్ణు'వని యనుచుండిరి. మానస సరోవరమే విష్ణువు యొక్క క్షీరసాగరము. మానస సరోవరము (మానుష + ఉర్వర్) మానస సరోవరముగా మారినది. అనగా, నచ్చట ప్రప్రథమముగ మానవసృష్టి జరిగియుండెను. ఆ స్థానమే మానుష = మనుష్యుల, ఉర్వర = పుట్టించు స్థానమని విశ్వసించబడినది. అట్టి ఆదిసృష్టికి విష్ణువు పాలకుడు, రక్షకుడు అని యెంచబడుచుండెడిది.

ఇట్లే సాహిత్యమున పర్వతీయ పురుషులు దేవతలుగ, స్త్రీలు దేవీ గణముగ నెంచబడుచుండిరి. పురాణములందు యముడు, వరుణుడు మున్నగు దేవతలు (విశ్వేదేవతలు) హిమాలయవాసులుగ చూపబడినారు. ఆకాశమున దేవీదేవతల కెట్టి కల్పిత స్థానమును లేదు. ఇంతేగాక ఈ దేవీదేవతల కేవిధమగు ప్రత్యేక స్థానము గాని, యోని గాని యుండదు.

41. ప్ర. హంస: అట్లయిన ఈ దేశమున చిత్రములందు జూపబడుచున్న శంఖ చక్ర గదా పద్మధారియగు విష్ణు వెవరు?

ఉ: 'విష్ణు' శబ్దమున కెన్నియో అర్థములు గలవు. అవి సూర్యుడు, యజ్ఞము, రాష్ట్రము మున్నగునవి. నీవు చూచిన చిత్రములందు రాష్ట్ర పురుషుని కల్పన యున్నది. 'విష్ణువు' రూపమున రేఖా చిత్రము (కార్టూన్) ద్వారా స్పష్టపరచబడినది. అదెట్లనగా- రాజు

వంతుడగును. కావుననే విష్ణురూప రాష్ట్ర పురుషుని ఆధారము 'శేషః' మిగులు అని చూపబడినది. శేష దనగా పాము. మనవారు విష్ణువు కాధారముగ పామును చూపినారు.

ఈ విధముగ పౌరాణిక విష్ణువు చిత్రము పూజించుటకు గాదు. అది యొక సఫల రాష్ట్ర పురుషుని కల్పనకు ఉత్తమ రేఖాచిత్రము (కార్టూన్) మాత్రమే. ఇంతేగాక బ్రహ్మ, విష్ణువు, శివుడు, చంద్రుడు, వాయువు మున్నగు నామములన్నియు పరమేశ్వరునివేనని వేదము తెలుపుచున్నది.

ఓం తదేవాఽగ్ని స్తదాదిత్య స్తద్వాయు స్తదుచన్ద్రమాః ।
తదేవశుక్రం తద్బ్రహ్మ తాఽఆపః స ప్రజాపతిః ॥
యజు. 32-1

ఓం సోమం రాజానం వరుణమగ్ని మన్వారభామహే ।
ఆదిత్య విష్ణు సూర్య బ్రహ్మణ చ బృహస్పతిమ్ ॥
సామ. పూర్వా. 1-2

స బ్రహ్మ స విష్ణు స్సరుద్ర స్స శివస్సోఽక్షర పరమస్వరాడ్ ।
స ఇన్ద్ర స్సకాలాగ్ని స్స చంద్రమాః ॥ (కైవల్యోపనిషత్తు)

అనగా ఆదిత్యుడు, వాయువు, చంద్రుడు, శుక్రుడు, ఆపః, ప్రజాపతి, సోమ, రాజ, వరుణ, ఇన్ద్ర, కాలాగ్ని, రుద్ర, శివ, ఓమ్, స్వరాట్, విష్ణు, సూర్య మున్నగు నామము లన్నియును పరమేశ్వరునివే.

పౌరాణికు లిట్టి ప్రత్యేక పేర్లతో వేర్వేరు రూపముల, వ్యక్తుల (దేవతల), వారి కుటుంబములను కల్పించినారు. వేర్వేరు ఉపాసనా పద్ధతులను గూడ చేసి అనేక సాంప్రదాయ పద్ధతుల నీ దేశమునం దాచరణలో పెట్టినారు, దీనివల్ల విశాలమగు 'ఆర్యజాతి' అనేక

అనగా, "అన్యదేవత లందు (పదార్థములందు) ఈశ్వరు డను బుద్ధి గలిగి ఉపాసన యొనర్చువాడు విద్వాంసులమధ్య ఏమి తెలియని పశువుతో సమాను డగును." అని వ్రాయబడియున్నది. నిరుక్తము నందు 'దేవత' అను దాని అర్థ మిట్లున్నది-

"దేవో దానాద్వా, దీపనాద్వా, ద్యోతనాద్వా, ద్యుస్థానో
భవతీతివా" - నిరుక్త.అ. 7-ఖం.5

దానాద్వా - దాన మొనర్చుట వల్ల దేవ నామ మేర్పడును.

దీపనాద్వా- ప్రకాశ మొనర్చుట, సత్యోపదేశ మొనర్చుట వల్ల దేవత లనబడుదురు.

ద్యోతనాద్వా- మాతా పితరులు, ఆచార్యులు, అతిథులు, పాలించువారు, విద్య నిచ్చువారు, సత్యోపదేశము నొనర్చు వారును దేవతలే యనబడుదురు.

ద్యుస్థానో భవతివా- ద్యుస్థానమున నుండు సూర్యాది ప్రకాశ మాన లోకములును దేవతలే యనబడును. పై నుదహరించిన గుణములు గల వారిని దేవత లందురు. ఇవి చేతనములు, జడములని రెండు విధములుగ నున్నవి. చేతన దేవతలతో సత్సంగ మొనర్చి, జడదేవతలతో విజ్ఞాన పూర్వకముగా వ్యవహరించి వాటినుండి లాభము నొందవలయును.

43. ప్ర. వీణ : నాలుగు వేదములు (ఋగ్యజుస్సామాథర్వణ ములు) ఈశ్వరీయ జ్ఞాన గ్రంథము లని నమ్మబడుచున్నవి. ఈశ్వరుడు నిరాకారుడు గదా ! అతడు వేదజ్ఞానము నెట్లు, ఎప్పుడు కలుగజేసినాడు ? జ్ఞానము నిచ్చుటకు ముఖాదీంద్రియములు ఆవశ్య కములు. నిరాకారు డగుట వల్ల ఈశ్వరున కవి యుండవు. వేదములు మానవకృతము లనియే అనేకులు విశ్వసింతురు.

వేదజ్ఞానము నిచ్చుట పరమేశ్వరున కేమాత్రము గొప్ప విషయము గాదు. సృష్టియందు మానవుడు జన్మించి వ్యవహారము లారంభించి నప్పటి నుండియే ఆతనిపై ధర్మాధర్మముల బంధనము విధించబడినది పరమేశ్వరుని నియమములు, అవసరమైన సమస్త జ్ఞానము మానవునకు ప్రారంభముననే ఈయవలసి యుండును. ఏల యన, ఆతడు తన కర్తవ్యములను తెలిసికొని ఆచరించుచు అకర్తవ్య విషయముల జోలికి పోకుండా నుండుటకు జ్ఞాన మవసరము కావుననే అట్టి వ్యవస్థ నొనర్చినాడు. వేదములు మనుష్య కృతములు గావు. అవి ఈశ్వరీయ జ్ఞాన గ్రంథములు. మనుష్య కృతములని నమ్మువారు వేదవిద్య యొక్క రహస్యము నెరుగలేరు. ఈ విషయమున మహర్షి దయానంద స్వామి విరచిత "ఋగ్వేదాది భాష్య భూమిక"ను జదివినచో వేద విషయక సమస్త శంకలు నివారణ యగును.*

44. ప్రశ్న: మాతాపితరులు లేకుండా ఆదికాలపు మానవు లెట్లు సృష్టించబడిరి?

ఉ: వర్షాకాలమున అచ్చటచ్చట అనేక జీవు లుత్పన్న మగు టను నీవు చూచియుందువు ఆ జీవులు ప్రతి స్థలమునందు పుట్టవు. ప్రత్యేక స్థలములందే పుట్టుచుండును. ఇదే విధముగ సృష్టి ప్రారంభము మొట్టమొదట వనస్పతు లుత్పన్న మగును. ఈ క్రమము మూడు చతుర్యుగముల పర్యంతము జరుగుచుండును. ఒక చతుర్యుగము 43,20,000 సంవత్సరములదై యుండును. ఆ పిదప పృథివిపై ఒక

* వేదమే 'ఈశ్వరీయ జ్ఞానము' అను మహత్వపూర్ణమగు గ్రంథమును ఆచార్య శ్రీరాం ఆర్యగారు హిందీ భాషయందు వ్రాసి వైదిక సాహిత్య ప్రకాశన్ కాస్‌గంజ్ (ఏటా) ఉత్తరప్రదేశ్ నుండి పకాశిత మొనర్చినారు. దానిని తప్పక చదువవలెను.

48. ప్ర. వీణ: మొట్టమొదటి మనుష్యాది ప్రాణులు హిమాలయ పర్వత ప్రాంతములందే ఏల యుత్పన్న మొనర్చబడినారు? ప్రపంచము నందలి అన్య ప్రదేశములం దేల సృష్టింపబడలేదు?

ఉ: హిమాలయ పర్వతములు ప్రపంచమందలి అన్ని పర్వతముల కన్న అత్యున్నతమైనవి. వాని యన్నిటికన్న ఎత్తయిన శిఖరము సముద్రోపరితలము కన్న 26,000 అడుగుల ఎత్తు గలదు. మొదటి సృష్టియొక్క అధికాంశ భాగము జలమునందే మునిగియుండెనని యందురు. హిమాలయ పర్వతముల పైనను జలజీవుల యొక్క అస్థిపంజరములు లభించినందు వల్ల ఒకప్పుడు దాని యధిక భాగము జలమయమై యుండెనను మాట ధృవపడుచున్నది ఈ స్థితి ప్రారంభ సృష్టి యందుండెను తరువాత దాని కొంత భాగమున జలము దొలగిపోయి ఎండుభూమిగ మారినది. కావుననే ప్రాణి సృష్టియును ప్రప్రథమున హిమాలయములం దట్టి భాగములందే జరిగినది. 'డేవిస్' అను అమెరికా దేశ ప్రసిద్ధ విద్వాంసుడు తన 'హార్మోనియా' అను గ్రంథము ఏడవ భాగము 327వ పుటయందు "హిమాలయము పృథివిపై అన్నిటికన్న ఉన్నత స్థానమనియు, ఆది సృష్టి హిమాలయముల పైననే జరిగిన"దనియు ఒప్పుకొనినాడు.

'శీతోష్ణము' లను రెండు కాలము లెచ్చట నుండునో అచ్చటనే ప్రారంభిక సృష్టియందు మానవుల పుట్టుక సంభవ మగును. హిమాలయముపై ఈ రెండు కాలము లుండును. ఫల పుష్ప తృణ తరు లతా గుల్మాదులు గూడా సమృద్ధిగా నుండినందున మానవులు, పశు పక్ష్యాదులు తమ కడుపులను సులువుగ నింపుకొనగలుగుచుండెను. మానవుని సహజాహారము 'ఫలములు, దుగ్ధములే' యను విషయము ధృవపరచబడినదే. హిమాలయములపై మొట్టమొదట శాకములు-ఆకు కూరలు, ఫలములు, తృణములు సమృద్ధముగ నుండుటవల్ల పాలిచ్చు

మున్నగు నదులు ప్రారంభమగును. ఇచ్చటనే బ్రాహ్మణు లుత్పన్న మైనారు. ఇంకా ముందున కిట్లు వ్రాయబడియున్నది. "దేవికా పశ్చిమే పార్శ్వే మానస సిద్ధసేవితమ్" దేవికకు పడమర దిశన సమీపముననే మానస (మానస సరోవర) మను స్థలము చుట్టుప్రక్కల సిద్ధ పురుషు లుందురు. దీనివల్ల ప్రప్రథమమున మానవసృష్టి హిమాలయములపై టిబెట్టు ప్రాంతము నందలి మానస సరోవరపు చుట్టుప్రక్కల ప్రాంతమేయై యుండెనని స్పష్టమగుచున్నది. ఆర్యసమాజ సంస్థాపకు లగు మహర్షి దయానంద సరస్వతి గారును ప్రారంభిక మానవుల అమైథునీ సృష్టి త్రివిష్టపమునందే జరిగిన ట్లంగీకరించినారు.

48. ప్ర. హంస : ప్రారంభ కాలమున వేదజ్ఞానము మానవు లందరకు లభించియుండెనా ?

ఉ : లేదు. ఆ సమయమునం దుత్పన్నమైన సమస్త మానవు లకు భాష మరియు వాణి మాత్రము లభించియుండెను. కేవలము అగ్ని, వాయు, ఆదిత్య, అంగిరులను నలువురు ఋషులకు క్రమముగ ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వ (అథర్వణ) వేదజ్ఞానము లభించియుండెను. వారట్టి జ్ఞానమును ఆది మానవులలో ప్రచార మొనర్చినారు.

49. ప్ర. హంస : 'బ్రహ్మ' యనగా నెవ్వరు ? వేదముల నిర్మాణము బ్రహ్మ యొనర్చినాడని కొందరనుచుందు రది వాస్తవమేనా?

ఉ : నాలుగు వేదముల జ్ఞానము ఆ నలుగురు ఋషుల ద్వారా ప్రపథమముగా లభించిన యా మహావ్యక్తి 'బ్రహ్మ' యను విశేషణ ముంటను. నేడు కూడా చతుర్వేద జ్ఞాతకు బ్రహ్మస్థాన మీయబడు చున్నది.

సర్వతోముఖోన్నతి కొరకు అవసరమగు జ్ఞానము, మోక్షప్రాప్తి కొరకు కావలసిన శ్రేష్ఠతమ సాధన సంపత్తు లెల్లయును వేదములందు నిహితమై యున్నవి. పరమేశ్వరు డీజ్ఞానము నంతటిని ఆదిమానవునకు ప్రసాదించి సృష్ట్యారంభము నుండి సృష్ట్యంతము (ప్రళయము) వరకు అది స్థిరముగ నుండు క్రమము నేర్పరచినాడు. వేదము లుత్పన్నమై నేటికి దాదాపు రెండర్బుదముల సంవత్సరముల కాలము దాటినను వాని యందొక్క మాత్రగాని, పదముగాని న్యూనాధిక్యము గాక ఉన్నవి యున్నట్లే ప్రచలిత మగుచున్నవి. వేదములు పరమేశ్వర జ్ఞానము. కావున పరమేశ్వరుని వలెనే సదా తమ స్వరూపము నందు విద్యమానమై యున్నవి. పరమాత్మ నిర్దేశకుడైనట్లే ఆతని జ్ఞాన భండారమగు వేదములును సర్వథా పవిత్రము మరియు నిర్దేశించునవియై యుండి సదా స్థిరముగ నిత్యమై యుండును.

51. ప్ర హంస : పరమాత్మ వేద జ్ఞానమును నలుగురు వ్యక్తులకే యిచ్చి యెల్లర కీయకుండుట పక్షపాతము గాదా ?

ఉ : 37,000 సార్లు సృష్ట్యుత్పత్తి, ప్రళయములకు పట్టునంత కాలము ముక్తి నొందిన జీవులు మోక్షానందము ననుభవింతురు. అంతటి దీర్ఘ కాలమును 'పరాంత కాల'మని యందురు. అవధి సమాప్తమైన పిమ్మట వారు మళ్ళీ సృష్ట్యారంభమున అమైథున సృష్టి యందు జన్మించెదరు. వర్తమాన సృష్టినుండి 36,000 సార్లు పూర్వోత్పన్న సృష్టియందు ముక్తి నొందిన జీవులందరిలో వారి కర్మల ననుసరించి సర్వశ్రేష్ఠ తపోధనులైన వారియందును, సర్వశ్రేష్ఠులగు నలుగురు ఋషుల ఆత్మలందు పరమాత్మ నాల్గు వేదముల ప్రకాశమును వేర్వేరుగ గలిగించినాడు. ఇందు పక్షపాత మను మాటయే లేదు. ఇది వైదిక సిద్ధాంతము.

విషయము. సుఖ మనునది భౌతిక పదార్థముల ద్వారా ఇంద్రియము లచే అనుభవించబడునది.

55. ప్ర. హంస : నాలుగు వేదము లందు గల మంత్రముల సంఖ్య ఎంత ? అవి ఏ ఋషుల ద్వారా ప్రకటించబడినవి ?

ఉ : నాలుగు వేదములలో మొత్తము ఇరువది వేల నాల్గువందల పదహారు మంత్రములు గలవు.

1. ఋగ్వేదమున 10,589 మంత్రములు. అగ్నిమహర్షి ద్వా
2. యజుర్వేదమున 1,975 మంత్రములు వాయుమహర్షిద్వార
3. సామవేదమున 1,875 మంత్రములు ఆదిత్య మహర్షి ద్వార
4. అథర్వణ వేదమున 5,977 మంత్రములు అంగిరస మహర్షి ద్వార మొత్తము 20,416.

56. ప్ర. హంస : బ్రాహ్మణ గ్రంథము లన నేమి ?

ఉ : ఋషులు వేదములపై వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథములను బ్రాహ్మణము లందురు.

57. ప్ర. హంస : ఉపనిషత్తు లన నేమి ? అవి యెన్ని ? అవి యన్నియును ప్రామాణికము లేనా ?

ఉ : ఋషులు కఠోర తపస్సు నొనర్చి తద్వారా ఆత్మ పరమాత్మల విషయములను అనుభవపూర్వకముగా తెలిసికొని ఆ జ్ఞానమును ఉపనిషత్తుల ద్వారా మనకు తెలిపి నారు. ఉపనిషత్తు లనేకములు. కాని అందు ప్రామాణికమైనవి పదకొండు మాత్రమే. అవి- "ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, ఛాందోగ్య,

60. ప్ర. వీణ : శాఖా గ్రంథము లనగా నేమి ?

ఉ : మహర్షులు వేదములపై అనేక వ్యాఖ్యాన గ్రంథములను వ్రాసియుండిరి. అవియే వేదముల శాఖ లనబడును. అందులో నిప్పుడు కొన్ని మాత్రమే లభించుచున్నవి. మిగిలినవి నష్టమైనవి- లుప్తమై పోయినవి.

61. ప్ర. హంస : అనేక విద్వాంసులు ఋగ్యజుస్సామములు మూడింటిని మాత్రమే వేదము లని నమ్ముదురు అథర్వణ వేదము తరువాత నిర్మింపబడినదని యందురు. వారు 'వేదత్రయీ' అని మూడింటికే మాన్యత నిత్తురు. మీరే మందురు ?

ఉ : నాలుగు వేదము లందును చతుర్వేదముల నామముల ఉల్లేఖనము గలదు. అథర్వ వేదము తరువాత వ్రాయబడిన దను మాట సత్యము గాదు. నాల్గు వేదము లందును మూడు విధములగు మంత్రములు గలవు. అనగా- గద్యాత్మక మంత్రములు యజుర్వేదమున, పద్యాత్మక మంత్రములు ఋగ్వేదమున, గాయనాత్మక మంత్రములు సామ వేదమున నున్నవి. నాలుగు వేదము లందలి సంపూర్ణ మంత్రములు ఈ మూడు విధములుగ ఋగ్యజుస్సామాత్మకమై యున్నందున వేదములు 'వేదత్రయీ' యనబడును. కాని వాని యర్థము వేదములు మూడే యని మాత్రము గాదు. సంస్కృత సాహిత్యము నందంతటను నాలుగు వేదముల మాన్యతయే గలదు.

వీణః హంస : అమ్మా ! మీరు నేడు మా యనేక శంకలకు సమాధాన మొనర్చితిరి. కాని మే మింకను అనేక శంకలకు సమాధానములను దెలిసికొనవలసి యున్నది. ఇట్లే ప్రతి దినమును ప్రశ్నోత్తరముల ద్వారా శంకా నివృత్తి చేసికొనుట వల్ల మా కెంతయో మేలు గలుగ గలదు.

కొనుటకు సంభవము గాజాలదు. కావున శంకరాచార్యుల వంటి సన్యాసి, తపస్వియును అట్టి అభ్యాస స్థితిపరులు (సాధకులు) నారీ సంసర్గమునకు దూర ముండవలెనని వ్రాసియుందురు. పురుషులే అనేకులు సంన్యాస, యోగాభ్యాస మార్గ పథికులుగ నుందురు. అట్లే ఏ విదుషీమణియైనను అట్టి అభ్యాసము చేయుచుండినచో ఆమెకు పురుషుడును నరక ద్వారమే యగును. ఆమె ఆతని సంసర్గము నుండి తప్పుకొనవలసియే యుండును. తులసీదాసు గారి యీ చౌపాయిని లోకులు తప్పుగా అర్థము చేసికొనినారు. దాని వాస్తవిక అర్థ మిట్లు గలదు.

శూద్రుడు - చదివినను, చదివించినను అవిద్వాంసుడుగ నుండు వాడు శూద్రు డనబడును.

గఁవార్ (మూర్ఖుడు) - వ్యవహార కుశలుడు గాని పరమ మూర్ఖుడు, అసభ్య పురుషుడు

ఢోల్ - మృదంగము, ఢోలు

పశునారీ- ఇందు పశు శబ్దము పశు ప్రకృతి గల మూర్ఖులగు అసభ్య స్త్రీలకు విశేషణముగ నున్నది.

"ఇవన్నియును తాడనము (దండన) ద్వారానే సన్మార్గమున నుంచబడు"నని వ్రాసియున్నారు. ఇది సత్యమే గదా ! ఇం దేమాత్రము ప్రత్యేకముగా స్త్రీల విషయమని లేదు. తులసీదాసు గారు దుష్ట స్త్రీ పురుషుల నెల్లర నొకే శ్రేణి యందుంచినారు. సజ్జనులు, పురుషార్థులగు పురుషులను, బ్రహ్మవాదినులు, శ్రేష్ఠ విదుషీమణులగు స్త్రీల నెప్పుడును ఎచ్చటను ఆతడు నిందించలేదు. దుష్టు లగు స్త్రీ పురుష లిరువురను గూర్చియు ఆ చౌపాయీలు వ్రాయబడినవి. పొరపాటున లోకులు శూద్ర శబ్దమును జాతి వాచకముగ పశు మరియు నారిని వేర్వేరుగ

చర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సంన్యాసాశ్రమము లందు ప్రవేశించుటకు నిర్దేశింపబడినది. స్త్రీలు వేదవ్యాఖ్యాతలుగా కూడ గణుతి కెక్కినారు. ప్రశాసనము మరియు సామాజిక సేవ లనబడు సమస్త క్షేత్రము లందును స్త్రీలు ముందంజ వేయుటకు వారియోగ్యతల ననుసరించి అవకాశము కల్పించబడి యుండెను. మహిళలు భూత, వర్తమాన కాలము లందును రాష్ట్రాధ్యక్షులుగ నుండిరి. మహిళ గృహ మందు శ్రేష్ఠమగు మాత, పతికి శ్రేష్ఠమగు పత్ని, గృహస్వామిని, మంత్రిణి మరియు గృహిణిగ కుటుంబ నిర్వహణలో పూర్ణాధికారము గలిగియుండును. నారీ గౌరవమున మను మహర్షి గారు స్పష్టముగ ఇట్లు వ్రాసినారు.

"యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్రదేవతా।
యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఽఫలాక్రియాః॥

మనుస్మృతి 3.56

ఎచ్చట, ఏ దేశమున, ఏ కుటుంబమునందు స్త్రీలు పూజింప బడుదురో అచ్చట దేవతలు అనగా విద్వాంసులు నివాస ముందురు. స్త్రీలకు అవమానము జరిగిన చోట శుభకర్మ లన్నియును నష్టమై పోవును. (ఇచ్చట పూజించుట యనగా పుష్పములతో పూజించుటగాక గౌరవించి సత్కరించుట యని భావము). ఈ విధముగ వైదిక ధర్మమున స్త్రీకి ఎంతటి గౌరవప్రదమగు, సమ్మాన పూర్ణమగు స్థాన ముండెడిదో అది ప్రపంచమందలి ఇతర ఏ ప్రదేశము నందును గానరాదు.

సాధారణముగ పురుషుల కార్యక్షేత్రము గృహము వెలుపలనే యుండును. ద్రవ్యోపార్జన, రాష్ట్రరక్షణము, వ్యాపారాదుల సంచాలనము కుటుంబ పాలన, పోషణ, రక్షణ యొక్క వ్యవస్థలు చేయవలసి

శక్తి అతి తీవ్రమై దూషిత పదార్థముల నష్ట మొనర్చును. దానితోబాటు స్వాస్థ్యకారక పదార్థముల పరమాణువులు ప్రాణులకు ఆరోగ్య ప్రదాన మొనర్చి శారీరక వ్యాధులను బోద్రోలి శరీరమునకు పుష్టి నొసగును. తినుట మరియు అగ్నియందు వ్రేల్చుటయందు గల భేదమును దెలిసి కొనుట కొక ఉదాహరణమును జూడుడు. ఒక మిరపకాయను దినినచో దాని ప్రభావము తినిన వారిపైనే కొంచెము పడును. కాని దాని నగ్నిలో వేసినచో ఆ చుట్టుప్రక్కల దూర ప్రాంతము లందుండు వారెల్లరకును దాని తీవ్ర ప్రభావము అసహనీయముగ నుండును. ఈ విధముగా యజ్ఞాగ్నిలో వేయబడిన కొద్దిపాటి పదార్థము అసంఖ్యాక ప్రాణులకు సుఖ సౌభాగ్యములను గలిగించగలవు.

వ్యాధులను దూర మొనర్చుటకు గూడ యజ్ఞముల ప్రయోగము జరుపబడును. వ్యాధుల నివారణ కవసరమగు కాష్ఠములు (సమిధలు) పత్ర పుష్పములను వైద్యులు ప్రయోగింతురు. యజ్ఞాగ్ని ద్వారా వాని సేవన మొనర్చినచో ఆ యోషధుల సూక్ష్మ పరమాణువులు శ్వాసక్రియ ద్వారా నేరుగా శరీరమున ప్రవేశించి రక్తమునందు గలిసి రోగి నారోగ్యవంతునిగ జేసివేయును.

ఇంకను వర్షకారక, వర్ష నివారక ఓషధుల ద్వార బృహద్య జ్ఞముల నొనర్చి అల్పవృష్టి, అనావృష్టి, అతివృష్టి క్రమముల ననుకూలముగ జేసికొనవచ్చును. యజ్ఞము ద్వారా గృహము, దేశము, ఆకాశముల వాయు మండలమును వ్యాధి నివారకము, సువాసితము, ఆరోగ్య ప్రదముగ నొనర్చవచ్చును. అన్నౌషధులు- శుద్ధము, శక్తి వంతము లగును. వృక్షముల సమీపమున లేక వాని క్రింద యజ్ఞ మొనర్చుట వల్లను; యజ్ఞ భస్మమును వాని మూలములందు వేయుట వల్లను గొడ్డు వృక్షములు సైతము ఫల పుష్పవంతములై వృద్ధి నొందగలవు. యజ్ఞ సూక్ష్మవాయు స్పర్శ వల్ల సకల జీవ జంతువులకు

విస్తారక (లౌడ్‌స్పీకర్)ల నుపయోగించి వేడుకల ప్రదర్శన మొనర్చ రాదు.

67. ప్ర వీణ : యజ్ఞ వేదికపై వస్త్రముల దొడుగుకొని కూర్చుండవచ్చునా ?

ఉ : వసుపు వచ్చని వర్ణము గల శుభ్రమగు ఉపవస్త్రము (శల్లా)ను పైనుండి కప్పుకోవలెను. అట్లు గాకున్న శుభ్రముగా నుదుక బడిన వదులుగా నుండు తేలిక వస్త్రములను ధరించి వేదికపై కూర్చుండవచ్చును. పవిత్రమగు యజ్ఞవాయువు సులభముగ శరీరమును స్పృశించునట్లుండి సోమరితనము గలుగకుండ నుండునట్టి వస్త్రములను ధరించవచ్చును.

68. ప్ర. వీణ : యజ్ఞమునకు పూర్వము స్నాన మొనర్చు టవసరమా ?

ఉ : ఔను. యజ్ఞ మనగా పరమేశ్వరోపాసనము. కావున స్నాన మొనర్చి శుద్ధ పవిత్ర స్థానమున యజ్ఞము చేయవలెను. యజ్ఞ పాత్రాది సామగ్రి, స్థలము అన్నియును శుద్ధముగ, పవిత్రముగ నుండ వలయును.

69. ప్ర. వీణ : అన్ని వేద మంత్రములతో యజ్ఞ మొనర్చ వచ్చునా ?

ఉ : అన్నపూర్ణ ! లేదు. ఏయే లక్ష్యములను దృష్టి యందుంచు కొని యజ్ఞ మొనర్చబడునో ఆయా లక్ష్యసిద్ధి కొరకు ఈశ్వర ప్రార్థనా మంత్రములు ఏయే వేదములందు గలవో ఆయా వేదముల నుండి ముందుగ వానిని సంకలన మొనర్చుకుని సామాన్య యజ్ఞక్రియ పూర్తియైన పిదప ఆయా మంత్రములతో యజ్ఞ మొనర్చవలయును.

71. ప్ర. వీణ : అమ్మా ! యజ్ఞోపవీతము యొక్క వ్యాఖ్యానము నొనర్చుచు అది ఏమి ? దానిని ధరించుటచే కలిగెడు ధార్మిక మరియు వైజ్ఞానిక మహత్త్వ మేమియో తెలుపుడు.

ఉ : యజ్ఞోపవీతము (యజ్ఞ + ఉప + వీతము) అనగా యజ్ఞమునకు ఉప = సమీపమునకు, వీతము = చేరుట) సమీపమునకు చేరుట మరియు చేరుట కధికారమును సంపాదించుట యని యర్థము. విద్యల నభ్యసించి యజ్ఞమున కధికారము పొందుటకు యజ్ఞోపవీతమును ధరించుకొనవలయును. యజ్ఞోపవీతము లేనివారు యజ్ఞమున కధికారులుగ అంగీకరించబడరు. ఇది విద్యా సూత్రము. కావున మూర్ఖులకు, విద్వాంసులు గాని వారికి దీని నీయకూడదు. యజ్ఞోపవీతము ద్విజుల మహత్త్వపూర్ణ సంస్కారము. విద్యావంతుడై, ద్విజుల గుణకర్మ స్వభావములు గల ప్రతి వ్యక్తి యజ్ఞోపవీత ధారణ కధికారి యగును. ఆతడు యజ్ఞము చేయుటకు, చేయించుట ప్రారంభించుటకు పూర్వము ఈ యజ్ఞోపవీత సంస్కారము నొనర్చుకొను టవసరము.

యజ్ఞోపవీతమున మూడు మూడు దారములు గల మూడు పోగు లుండును. ఈ మూడు పోగులు మనుష్యుని ఎల్లప్పుడు శారీరక, మానసిక, ఆత్మిక దృష్టితో పరిశుద్ధముగ నుంచుటకును, అతని భుజ స్కందమున పితౄణము, ఋషి ఋణము, దేవ ఋణముల భారము గలదని గుర్తు చేయుటకును; మనస్సు, శరీరము, ఆత్మలో కుసంస్కారములు పడవేయునట్టి, అనారోగ్యము గలిగించునట్టి, జీవనోన్నత మార్గమున బాధాకరమగునట్టి, నిందాపాత్రు డగునట్టి అకార్యము లేవియును చేయరాదని జ్ఞాపక మొనర్చుచుండును. యజ్ఞోపవీతము శుద్ధికి చిహ్నము. అపవిత్ర హస్తములతో దానిని స్పృశించ గూడదు. మల మూత్రముల విసర్జన కాలమున అది అశుద్ధము గాకుండ నుండుటకై

శరీరమును శుద్ధముగ, పవిత్రముగ నుంచుటకు, వానిని దీర్ఘ కాలము వరకు ఆరోగ్యముగ, స్థిరముగ నుంచుటకు, శతాయువు కన్న అధిక కాలము పరాధీనులు గాకుండా జీవించియుండు భావనను గలిగియుండుటకు యజ్ఞోపవీతము ప్రతి క్షణము జ్ఞాపక మొనర్చుచుండునని భావము

ప్రతి ద్విజ బాలకుడు గురుకులమున లేక ఆచార్య కులమున ప్రవేశించి నియమపూర్వకముగా -

4 వేదములు (ఋగ్యజుస్సామాథర్వములు)

4 ఉప వేదములు (ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వ వేద, శిల్ప వేదములు)

6 అంగములు (శిక్షా, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిష్యము)

6 దర్శనములు (న్యాయ, సాంఖ్య, యోగ, వేదాంత, మీమాంస వైశేషికములు)

3 సూత్ర గ్రంథములు (గృహ్యసూత్ర, శ్రౌతసూత్ర, ధర్మ సూత్రములు)

9 ఆరణ్యకములు (బ్రాహ్మణములు, ఉపనిషత్తులు, ఇతిహాసము పురాణములు, పరిశిష్టములు, ప్రయోగములు, పద్ధతులు, అనుక్రమణికలు, పద పాఠములు)

24 కళలు (గాన, నాట్య, వాద్య, నృత్య, చిత్ర కళాదులు).

ఈ ప్రకారముగ 96 విధములగు విద్యలు మరియు కళల అభ్యాసము, అధ్యయన మొనర్చి పూర్ణ విద్వాంసు డగుటకు యజ్ఞోపవీతధారి ప్రయత్న మొనర్చవలసి యుండును.

73. ప్ర. హంస : యజ్ఞోపవీతమున నుండు మూడు బ్రహ్మముడుల రహస్య మేమి ?

ఏ నాడియొక్క ఏ భాగమైనను వ్యాధిగ్రస్తమైనచో దానికి పక్షవాతమైన దని యందుము. ఈ సుషుమ్న నాడి ఉత్తేజితముగ నున్నచో ఏ యంగమునకును పక్షవాతము వచ్చు భయ ముండదు. ఈ నాడి వెన్నెముక మధ్యనుండు అస్థి సంస్థానము నుండి పిరుదుల క్రింది ప్రదేశమున ప్రారంభమై తలపై 'శిఖా' భాగమున అంతమగును. శిఖ పెద్దగా, ఒత్తుగా నుండుటవల్ల వెంట్రుక లందలి ఆ భాగమున విద్యుత్తు త్పన్నమై దానివల్ల సుషుమ్న నాడి ఉత్తేజితమై యుండును. కావున శరీరము నందే భాగము నందైనను, ఎప్పుడును పక్షవాతము రాజాలదు.

శిఖనుంచు స్థలముననే 'లఘుమస్తిష్క' మనునది గోష్పాదా కారమున అంతయే పెద్దదిగా నుండును. అదియును సుషుమ్నము ద్వారానే సంచాలిత మగును. ఆ స్థానమునందే గోష్పాద సమానమైన శిఖనుంచు విధానము గలదు. దానివల్ల లఘుమస్తిష్కము వికసించును. దక్షిణ భారతము నందలి వైజ్ఞానికులు పరిశోధన (రిసర్చ్) చేసి "పెద్దగా, ఒత్తుగా, వెడల్పుగా శిఖాధారణ మొనర్చిన బ్రాహ్మణులు తీవ్ర ధారణాబుద్ధి గలవారై యుందు"రని తేల్చినారు. శిఖ నుంచు కొనుట మన ధార్మిక, సాంస్కృతిక చిహ్నమేగాక వైజ్ఞానికముగ జూచినను ఎంతో ఉపయోగకరమైనది.

78. ప్ర. వీణ : అమ్మా! నా కిప్పుడు బాగగ అర్థమైనది. అందులకే గాబోలు స్త్రీలపై పక్షవాత ప్రభావము బహుశః ఉండనే ఉండదు. ఏల యన, వారి తలలపై పెద్ద తలకట్టుండును గదా! కొన్ని విశేష రోగ కారణముల వల్ల కొందరు స్త్రీలకు మాత్రము పక్షవాతము స్వల్పముగ వచ్చుట సంభవించును. కాని పురుషులందు అందులో తలపై జుత్తు లేని వా రనేకులకు ఈ పక్షవాత వ్యాధి వచ్చుచుండును.

కాలము లందలి అనేక విషయములను ఉన్న దున్నట్లు చెప్పుచుందురు. అది యెట్లు సాధ్యమగును ? అది యెట్లు అభ్యసించబడునో తెలుపుదురా.

ఉ : తార్కిక మస్తిష్కమును శాంతింపజేసి ఉపచేతనా శక్తిని చైతన్య మొనర్చి భూత భవిష్య ద్వర్తమాన కాలములందు జరుగుచుండు అనేక విషయములు తెలిసికొనబడును. అభ్యాసము వల్ల ఈ విధముగా నొనర్చవచ్చును. ఒక్కొక్కప్పుడు ఏదో యొక విశేషావస్థయందు కొందరి ఉపచేతనాశక్తి జాగృతమై వారు ఇట్టి విషయములను చెప్పుచుందురు అభ్యాసముచే ఇట్టి యవస్థను పొందవచ్చునని తెలిపితిని గదా ! అంజనము మున్నగు వానిద్వారా జరుగు క్రియలు గూడ ఇట్టి శక్తి చేతనే చేయించుకొనబడుచున్నవి. రాత్రి నిద్రించుటకు పూర్వము అర్ధ నిద్రావస్థయందు ఒకానొక సమయమున ఇన్ని గంటలకు మేల్కొలువవలసినదిగా తన్ను తా నాదేశించుకొని నిద్రించవలెను. లఘుమస్తిష్కముతో సంబంధమున్న ఉపచేతనా శక్తి ఆ మనుష్యుని సరిగా అదే వేళకు మేల్కొలుపును. ఇట్లే వరసగా కొంతకాలము అభ్యాస మొనర్చినచో ఈ శక్తి పూర్తిగా, నమ్మకముగా పని చేయుచుండును. *

---

* మానసిక శక్తులను గురించి కూడ లోకములో భిన్న భిన్న అభిప్రాయములు గలవు. Hypnotism ద్వారా మనలోని కొన్ని మానసిక బలహీనతలను దూరము చేసుకొనవచ్చును. శారీరక బలమును, ఇంద్రియ శక్తులను కొంతవరకు పెంచుకొనవచ్చును. Regression (జీవితములో వెనుకకు పోవుట) ద్వారా మన జీవితములో పూర్వము జరిగిన సంఘటలను కొంతవరకు గుర్తు చేసుకొనవచ్చును. కాని యితరుల భూత భవిష్య ద్వర్తమానములను తెలుసుకొనుట ! — ఆలోచించవలసిన విషయము. - ప్రకాశకులు

దెలిసికొని వికసింప జేసికొని లాభము నొందుట యోగి పురుషుల కార్యము. సర్వసాధారణ మానవుల కిది సుసాధ్యము గాదు కాని కష్టసాధ్యము.

81. ప్ర. హంస : యోగి ఆకాశమందు విహరింపగలడా ?

ఉ : ఔను. యోగి సంకల్పముతో తన శరీరమును భార రహితము (తేలిక)గ నొనర్చుకొని మనోవిద్యుత్తునకు ఆకాశ విద్యుత్తుతో సంబంధము గలిపి మనోశక్తి యోగమున తలచిన చోటికి చేరగలడు. ఆకాశగమన మొనర్చగలడు. దూర దేశస్థ విషయము లను తెలిసికొనగలడు. స్వమనోగత విషయముల నితరుల మనస్సు లందు ప్రవేశింపజేసి వారిని ప్రభావితుల జేయగలడు. ఈ శక్తి యోగ సిద్ధుల వల్ల ప్రాప్తించును. కొందరకు మాత్రము పూర్వజన్మ సుకృతముల వల్ల లభించును. దీనిని పూర్ణయోగి పురుషుడే సిద్ధింప జేసికొనగలడు. *

82. ప్ర. హంస : మనస్సు నందును విద్యుత్తుండునా ?

ఉ : వేదములందు మనస్సు "జ్యోతిషాం జ్యోతిః" అనగా అది విద్యుత్కేంద్రమని ధృవపరచబడినది. వాస్తవమే గదా !

83. ప్ర. హంస : ఆకాశమందు వ్యాప్తమైయున్న సూక్ష్మ శబ్దములను యోగి వినగలడా ?

---

* ముందు పేజీలో సూచించినట్లుగా యోగసిద్ధులను గూర్చిన సరియైన అవగాహన కొరకు ఆర్ష గురుకుల ప్రచురణ - 'యోగ మీమాంస' చదువగోరెదము. - ప్రకాశకులు

రెండు రకములగు ఋణగుణము, ధనగుణము (నెగిటివ్, పాజిటివ్) అను విద్యుద్ధారలు జలముతో పాటు ఉత్పన్న మగుచుండును. వాని సంసర్గము వల్ల భయంకర గర్జనల ధ్వనులు, మెరుపుల ప్రకాశము ఉత్పన్న మగుచుండును.

86. ప్ర. వీణ : ప్రాచీన ఋషులు, మునులు తలలపై జటల నేల ఉంచుకొనుచుండిరి ? ఆ కాలమున కత్తెరలు, కత్తులు లేకుండెడివా ?

ఉ : తలపై వెంట్రుకలలో విద్యుత్సంగ్రహము జరుగుచుండును ఆ విద్యుత్తు వల్లనే మస్తిష్క శక్తి వికసించుచుండును. ప్రాచీన ఋషులు, మునులు దాని సంగ్రహము, ఉపయోగము, ధ్యాన, సమాధ్యవస్థయందు జేయుచుండిరి. కావున వారు తలలపై జటలను బెంచుట వైజ్ఞానిక దృష్టితో అత్యావశ్యకమని ఎంచుచుండిరి. కేశముల గొరుగు, కత్తిరించు పరికరములు భారతదేశమునం దనాది నుండియే ఉండెను. మిగతా సర్వజనులును వెంట్రుకలు గొరిగించుట, కత్తిరించుట జరుపుకొనుచుండిరి గదా !

87. ప్ర. వీణ : సాదువులు, మహాత్ములు గైరిక (జాజు) వర్ణము మరియు ఎఱ్ఱని కాషాయ వస్త్రము లేల ధరించుచుండిరి ?

ఉ : ఎఱ్ఱని వర్ణము ఊష్మ (ఉష్ణ) ప్రధానమొనర్చు గుణము గలది. అది చలిని, వాతవ్యాధులను ఉత్పన్నము చేయనీయదు. ఉత్పన్నమైనను దానిని నశింప జేయును. పక్షవాతము మున్నగు భయంకర వ్యాధులను గూడ నాశన మొనర్చును. స్నాయు నాడులకు పుష్టి నొసగును. కామ వాసనల నణచివేయును. వర్ణము (రంగు)ల వల్ల శరీరముపై జరుగు ప్రభావములను (వర్ణ విజ్ఞానమును) మన

89. ప్ర. వీణ : శ్రీకృష్ణచంద్రుని కాలము గడచి ఎన్ని సంవత్సరము లైనది ?

ఉ : శ్రీకృష్ణుని కాల మిప్పటికి దాదాపు 5,085 సంవత్సరములకు పూర్వముది.

90. ప్ర. హంస : అమ్మా ! రావణుని లంకానగర మెచ్చట నుండెను ? ఇప్పటి శ్రీలంకయే రావణుని లంకయై యుండెనా ?

ఉ : ఇప్పటి లంక నేటికి దాదాపు తొమ్మిది లక్షల సంవత్సరముల క్రిందట భారతదేశములోని భూభాగమే. సముద్రము కోసి దానిని భారతదేశము నుండి వేరు పరచినది. రావణుని లంకా విషయమున రామాయణమునం దిట్లు వ్రాయబడియున్నది :

"శత యోజన విస్తీర్ణం సాగరో మకరాలయమ్ ।
అలంఘ యిమసానంద సందోహో మారుతాత్మజః ॥

ఆధ్యాత్మ రామా. సుం.కా. 1-1

అనగా హనుమంతుడు జల జంతువులతో పూర్ణము, శతయోజన విస్తీర్ణమునగు సముద్రమును దాటి లంకకు జేరియుండెను. ఐతే భారతదేశము మరియు లంకకు మధ్య వంద యోజనములు (నాలుగు వందల క్రోసులు లేక దాదాపు 8, 9 వందల మైళ్ళ) విస్తీర్ణ సముద్రముండెను. ఇప్పటి శ్రీలంక భారతదేశము నుండి కేవలము 23 మైళ్ళ దూరముననే యున్నది. ఇది రావణుని లంక గాజాలదు. భూగోళ పటమును జూచుటవల్ల దెలియున దేమన, ఆఫ్రికా ఖండ సమీపమున సముద్రమునందు 'మెడాగాస్కర్' (Medagasker) అను నొక ద్వీపము గలదు. అది భారతదేశపు దక్షిణ తీరమునకు దాదాపు వేయి మైళ్ళ దూరమున నున్నది. ఆ దేశవాసులు 'నీగ్రోల' వలె నుందురు.

రాముడు తన తమ్ముడగు లక్ష్మణునితో బాటు సాయంకాలమున సంధ్యోపాసన నొనర్చి ఋష్యాశ్రమమున ప్రవేశించి ఆతనికి అభివాదన మొనర్చినాడు.

"తత్రైవ గచ్ఛత స్తస్య వ్యాపాయద్ రజనీశివా ।
ఉపాస్యతు శివాం సంధ్యాం విషయాన్తరగాహతు ॥"

వా.రా. అయో. 49-2

"నడుచుటయందే శ్రీరామునికి శుభప్రదమగు రాత్రి గడచినది. ప్రాతఃకాల సంధ్య నొనర్చుకొని యాతడు ముందుకు నడచి రెండవ దేశమునకు చేరినాడు." దీనివల్ల శ్రీరాముడు ప్రాతః సాయం సంధ్యోపాసన లొనర్చుచుండినట్లు స్పష్టమగుచున్నది.

"సంధ్యాకాల మనాః శ్యామా ధృవమేశ్యతి జానకి ।
నదీచేమాం శుభజలాం సంధ్యార్థే వరవర్ణినీ ॥"

వా.రా. సుం. 14-59

"సీతాదేవి సాయంకాల సంధ్య నొనర్చుటకు ఈ శుభజల యుక్తమగు నదీతీరమునకు తప్పక రాగలద"ని హనుమంతుడు తలచినాడు. దీని వల్ల సీతాదేవి సంధ్య నొనర్చుచుండెడిదని స్పష్టమగుచున్నది.

"క్వాపిసంధ్యా ముపాసీనాం జప న్తం బ్రహ్మవాస్యతామ్ ।
ధ్యాయ న్త మేకమాసీనం పురుషం ప్రకృతేః పరమ్ ॥

భాగ. 30-10-69

శ్రీకృష్ణు డెచ్చటనో ఏకాంతమున కూర్చుండి మౌనవ్రతుడై ప్రకృతితో గూడ పరబ్రహ్మ ధ్యాన మొనర్చుచుండెను. అప్పుడు నారదుడు ఆతని జూచినాడు.

ఈ ప్రమాణము వల్ల శ్రీకృష్ణచంద్రుడు తన్మయత్వముతో పరమేశ్వరోపాసనము నొనర్చుచుండె ననుట స్పష్టమగుచున్నది.

94. ప్ర. వీణ : అత్తపత్తి (సిగ్గాకు) మొక్క మనుష్యుని చేయి తగులగనే ముడుచుకొని పోవుచున్నందున ఆ మొక్కలో జ్ఞానము (తెలివి) గల జీవాత్మ యుండునని యనిపించును గదా ?

ఉ : సూదంటురాయి (అయస్కాంతము) లోహము నాకర్షించునట్లు జీవాత్మ లేకున్నను విద్యుత్ప్రభావము వల్ల యంత్రములు స్వయముగా నడచుచున్నట్లు మానవ శరీర వాసన మరియు విద్యుత్తు స్పర్శ వల్ల సిగ్గాకు మొక్క ముడుచుకొనును. ఇది భౌతిక పదార్థములపై భౌతిక ప్రాణశక్తి మరియు విద్యుత్ప్రభావ కారణమున జరుగును. దిక్సూచి యొక్క సూచి ఎల్లప్పుడును ఉత్తర దిశనే చూపును. దానిలో జీవాత్మ ఉండి దిశను చూపుచుండునని యనగలమా ? ఉత్తర ధృవపు ఆకర్షణ శక్తి వల్ల సూది ఆ దిశకే మరలుచుండును. ఇవి యన్నియును విజ్ఞాన సంబంధ విషయములు. వానిలో జీవాత్మ ఉండియే ఆ పనులను చేయుచున్నదని యనజాలము.

95. ప్ర. హంస : శ్రీరామచంద్రుడు మాంసాహారియా ? అతడు మృగములను వేటాడుచుండెనట గదా ?

ఉ : శ్రీరాముడు మాంసాహారి కాడు, అతడు వేదవిదుడు, మహాపురుషుడు. వైదిక ధర్మమున మాంసాహారమును తామస, రాక్షస భోజనముగ నెంచబడినది. వైదిక ధర్మానుయాయి అగు శ్రీరాముడు మాంసాహారి యెట్లగును ? మొదట వాల్మీకి రామాయణమున 6,400 శ్లోకములు మాత్రమే యుండెను లోకులు అందు అనేక ప్రక్షేపములను చేర్చిరి. ఇప్పుడు దానియందు 24,000 శ్లోకము లున్నవి. శ్రీరాముని మాంసాహారిగా ప్రకటించు శ్లోకము లన్నియు వామ మార్గీయులచే ప్రక్షిప్తము లొనర్చబడినవే. వానిని మనము నమ్మగూడదు

శ్రమనైనను సహించగలదు. ఎంత దూరమైనను పరుగు తీయగలదు. శాకాహారి యగు వానరము విశాల వృక్షములను ఊపగలదు. మాంసాహారి యందట్టి శక్తి యుండదు.

పరమేశ్వరుడు మానవుని శాకాహార శ్రేణి జీవిగ జేసినాడు. మాంసాహార జీవులకన్న నాతని శరీర నిర్మాణము భిన్నముగ నుండును. అవి మాంసమునకై జీవులను చంపి చీల్చుట కనుకూలముగ పళ్ళు మొనదేలి పదునుగా నుండును. మాంసాహారులు నీరు త్రాగు నప్పుడు 'చప చప' మను ధ్వనితో నీటిని నాలుకతో చప్పరించి మ్రింగును. వాని శరీరముల నుండి చెమట వెడలదు. మాంసాహార జీవుల ఆహార నాళిక శాకాహార జీవుల నాళిక కన్న మిక్కిలి కురచగా నుండును. చిన్న నాళికయందు మాంసాహారము త్వరగ జీర్ణమగును. కాని పొడవు నాళికయందది జీర్ణమై బయటపడుటకు అధిక సమయ మవసరము. అందువల్ల ప్రేవులందు ఆహారము కుళ్ళిపోవును. కావుననే మాంసాహార జీవుల నాళికను ఈశ్వరుడు కురుచగ నుంచినాడు. మాంసాహార, శాకాహార జీవుల చేతులు, వంజాలు, గోళ్ళు భిన్నముగా నుండును. మానవ శరీర నిర్మాణము శాకాహార జీవుల కోవకు జెందునో, మాంసాహార జీవుల కోవకు జెందునో ఎవ్వరైనను సులువుగా దెలిసికొనవచ్చును.

మాంసాహార జీవుల పిల్లలు స్వభావసిద్ధముగనే వేటాడును. కాని శాకాహార జీవుల పిల్లలు, మనుష్యుల పిల్లలు ఫల శాకముల నపేక్షించుచు మాంసము నసహ్యించుకొనును. మురికి వస్తువులపై వ్రాలు స్వభావము గల ఈగలు మాంసముపై మూగును గాని, ఫలము లపై, కూరగాయలపై వాలవు. కావున మాంసము 'మురికి వస్తు'వని సిద్ధమగుచున్నది. మాంసము నగ్నిలో వ్రేల్చిన దుర్గంధ ముత్పన్న మగును. కాని ఫలముల నగ్నియందు గాల్చిన లోకులకు సుఖదాయక

మందగింప జేయును. గ్రుడ్లయందు 'కొలెస్ట్రోల్' అను నొక పదార్థము గలదు. అది కాలేయమునందు జేరి రక్తవాహినుల సిరలను పెళుసుగా నొనర్చి పిత్తాశయమున రాళ్ళను (మూత్రాశ్మములను) ఉత్పన్న మొనర్చుట వల్ల రక్తపుపోటు (బ్లెడ్ ప్రెషర్) అధికమగును. గ్రుడ్డు లోని తెల్ల సొనయందు 'ఎవిడిన్' అను పేరుగల పదార్థముండి తామర గజ్జివంటి రోగములను గలిగించును. 'కొలెస్ట్రోల్' వల్ల మూత్ర పిండముల వ్యాధులు గూడ గలుగును.

గ్రుడ్డు సాక్షాత్తుగ ఒక జీవియొక్క గర్భమే. గర్భపాత మొనర్చి వానిని దినుట మానవత్వమేనా? అతి నికృష్ట కార్యముగాదా? కొందరు గ్రుడ్లను ఫలములని, శాకాహారముతో సమానమేనని చెప్పుచు లోకులను మోసపుచ్చుట అన్యాయము. మాంసాహార వ్యక్తి మస్తిష్కము క్రోధము, ఈర్ష్య, స్వార్థ భావములతో అసంతులితముగ నుండును.

శాకాహార జీవులు చీకటియందు చూడజాలవు. ఇవి భోజనమును చక్కగ నమలి మ్రింగును. ఇవి శ్రేష్ఠ గుణముల ధారణ మొనర్చుకొని ఆస్తికత, సభ్యత, విశ్వాసము గలవై యుండును. 'బ్రతుకుము, బ్రతకనిమ్ము'ను స్వభావము శాకాహార జీవులు, మరియు అట్టి మనుష్యు లందే కానవచ్చును. కావున ఏ దృష్టితో చూచినను మనుష్యు దనగా మననశీలుడు, ధర్మాత్ముడు, శ్రేష్ఠప్రాణి, శాకాహార జీవి యని స్పష్టమగుచున్నది. ఈశ్వరుడు మానవుని శాకాహారిగానే సృష్టించినాడు కాని మాంసాహారము వల్ల మానవత్వ ధర్మము నుండి స్వయముగనే పతితుడైనాడని తలచవలెను.

మాంసాహార జీవులు ఆహారమును గబగబ మ్రింగివేయును. అవి రాత్రి కారుచీకటియందు కూడ చూడగలవు. వాని సరాసరి ఆయువు చాల తక్కువగా నుండును. అవి ప్రచండమైనవిగ ఇంద్రియ

ఫలములు, కందములు (దుంపలు), వ్రేళ్ళు, శాకములు మొదలగునవి సేవించుటయే ధర్మమగును. మానవ శరీరమున కవసరమగు సమస్త తత్త్వములు శాకాహారము ద్వార లభించును. శాకాహారవర్గ ప్రాణులకు శాకములు, మాంసాహారవర్గ ప్రాణులకు మాంసము సహజాహారమై యుండును.

100. ప్ర. పీఠ : మాంసాహార జీవులకు మాంస మేల హానిని గలిగించదు ? వానికి మాంసాహారము వల్ల హత్యాపాప మేల అంటదు?

ఉ : మనుష్యుడు కర్మ, భోగమను ఉభయ యోనులకు చెందినవాడు. ఈ యోనియందాతనికి 'పాప పుణ్యములు' అను బంధన ముండును. ఈశ్వరు డాతనికి ధర్మాధర్మముల నెరుగు బుద్ధిని గూడ ప్రసాదించినాడు. మిగతా యోనులన్నియును కేవలము భోగ యోనులు మాత్రమే. అవి మనుష్య యోనులం దొనర్చిన కర్మఫలము ననుభవించుచుండునని తెలియుచున్నది. వానియందు పాపపుణ్యముల బంధన ముండదు. మాంసాహార వర్గ జీవుల శరీర నిర్మాణము మాంసమును సులభముగ జీర్ణించుకొనునట్లు, దానివల్ల ప్రాణులకు హాని గలుగకుండునటు జరిగినది. ఏయే జీవుల కర్మ కారణమున ఏజన జీవుల హత్య జరిగియుండునో అట్టివే ఆ మాంసాహార జీవులకు భోయే మగుట జరుగును. దీనివల్ల ఒక జీవికి కర్మలకు శిక్ష హత్యారూపమున లభించునప్పుడు రెండవదాని క్షుదా నివారణ జరుగును. అందువల్ల దాని పూర్వజన్మ ప్రతీకారము గూడ పూర్తియగును. ఇది పరమేశ్వరుని కర్మఫల వ్యవస్థయై యున్నది.

నాల్గవ దినము- నాల్గవ అధ్యాయము సమాప్తము

వీరి జాలమున బడుచున్నారు. ఇట్టి వారిని గాంచిన విద్యావిహీనులు, అల్ప విద్యావంతులు "అంత గొప్ప డిగ్రీలు గలవారే వారి శిష్యులైనారు గదా !" యని తలచి వీరును ఆ మార్గముననే అవలంబింతురు. ఈ విధముగా తర్కము నవహేళన మొనర్చి వ్యక్తి నిర్మిత మతములందు బడి రెండు పడవలందు రెండు పాదముల నుంచి ప్రయాణ మొనర్చుచున్నారు. అట్టి వారిని గాంచి చలించక ఈశ్వరుడు ప్రసాదించిన చక్కని బుద్ధితో నాలోచించుడు. గారడీ వింతలను గాంచి మోసపోకుడు. మహాపురుషు డెవ్వడును తమాషాలు చేసి తమ శక్తులను వమ్ము చేసుకొనడని నమ్ముడు. ఇక మీ శంక లేమియో అడుగుడు.

101. ప్ర. వీణ : అమ్మా ! సారాయి మున్నగు మాదక ద్రవ్యముల సేవన వల్ల చురుకుదనము, ఉత్సాహము పెరుగునని లోకులనుచుండుట ఎంతవరకు యథార్థము ?

ఉ : సారాయి మనుష్యుని స్వాస్థ్యమును, సదాచారమును నాశన మొనర్చును. ఇది మానవ సమాజమునకు శత్రువు. సారాయి ఒక రకమగు విషము. దీని సేవన వల్ల జీర్ణకోశమున మంట, హృదయ సూక్ష్మనాడులు నష్టమగుట, జీర్ణశక్తి నశించుట, హృదయము ముడుచుకొనుట, మేధస్సునందు రక్తము పేరుకొని పక్షవాతము వంటి భయంకర వ్యాధు లుత్పన్న మగుట, ఆలోచనా శక్తి క్షీణించుట, ఒక్కొక్కప్పుడు పిచ్చితనము గలుగుట కూడ సంభవించును. జీర్ణ రసము సిద్ధము గాకుండ మలబద్ధకమును గలిగించును. జీర్ణక్రియ క్షీణించును. మస్తిష్కము ఉత్తేజిత మగును. స్త్రీలయందు రజమును, పురుషులలో వీర్య ధాతువులను పలచగ నొనర్చి చెరచును. ప్రదర ప్రమేహాది వ్యాధులను గలిగించును శరీరమును బోలుగ, దుర్బలముగ నొనర్చును. శక్తి క్షీణించును. త్రాగుబోతు ఆయువు తగ్గుచు శీతోష్ణములను సహించుకొనజాలడు. త్రాగుడు అలవాటు గల వారి

1. బ్రాహ్మణులు :

అధ్యాపన మధ్యయనం యజనం యాజనం తథా ।
దానం ప్రతిగ్రహశ్చైవ బ్రాహ్మణానా మకల్పయత్ ॥

(మను. 1.88)

"చదువుట, చదివించుట; యజ్ఞము చేయుట, చేయించుట; దానమిచ్చుట పుచ్చుకొనుట అను నీయారు బ్రాహ్మణుని కర్మలు". చక్కని ధార్మిక ప్రవృత్తి గలవారు, స్వాధ్యాయము విద్యాధ్యయమున రుచి గలవారు, పవిత్ర జీవనము గలవారు, సత్యవాది, సత్కర్మపరుడు, పరోపకారి, యజ్ఞాది శుభకర్మల చేయుచు చేయించువారు, విద్యాదానము నొనర్చువారు, వేదాధ్యయనము చేయువారు, శాస్త్ర విద్వాంసులు, సమాజమును శాస్త్రానుకూలముగా నడుపువారు, ఉపదేష్ట బ్రాహ్మణులుగ నెంచబడుదురు.

2. క్షత్రియులు :

ప్రజానాం రక్షణం దాన మిజ్యాధ్యయన మేవచ ।
విషయయేష్వ ప్రసక్తిశ్చ క్షత్రియస్య సమాసతః ॥

(మను. 1.89)

న్యాయముగ ప్రజలను రక్షించుట, శ్రేష్ఠులను సత్కరించుట, దుష్టులను శిక్షించుట, విద్య ధర్మములందు ధనము మున్నగు పదార్థములను వ్యయపరచుట, యజ్ఞాదులను చేయుట. చేయించుట; వేదాది శాస్త్రములను చదువుట, చదివించుట; విషయములందు దగులుకొనక జితేంద్రియుడై సదా శరీరమును, ఆత్మను బలిష్ఠముగ నుంచుకొనుట క్షత్రియ ధర్మము.

స్వభావసిద్ధముగ క్షాత్ర ధర్మమున రుచి గలవారు, శూరవీరులు అస్త్ర శస్త్ర విద్య నభ్యసించువారు, బలిష్ఠులు, దేశ రక్షణమున శ్రద్ధ

అర్హుడు, యోగ్యుడు నగునో దానియందే ప్రవేశింపజేయుట ప్రాచీన మర్యాదయై యుండెను.

103. ప్ర. హంస : ప్రపంచమున భూకంపము లేల గలుగుచుండును ?

ఉ : భూమిలో అడుగు భాగమున అతి వేడిమి మున్నగు కారణములచే ఏ భూభాగ మందైనను ఏదైన తారుమారు జరిగినప్పుడు భూమి పై భాగమున భూకంపనలు జరుగుచుండును.

104. ప్ర. వీణ : 'ఆర్య' శబ్దమున కర్థ మేమి ?

ఉ : "శాంతస్తితిక్షు ర్దాన్తస్య సత్యవాదీ జితేన్ద్రియః ।
దాతాదయాళుర్నమ్రశ్చ ఆర్య స్యాదష్టభి ర్గుణైః ॥ మ.భారతం

ఆర్య శబ్దమునకు "శ్రేష్ఠుడు, ఆచరణశీలుడు, ఉత్సాహవంతుడు పరోపకారి, ఈశ్వర విశ్వాసి, వైదికధర్మి, ఆర్య వంశీయుడు, సత్య భాషి, సాత్వికాహారి, భూతదయ, పవిత్ర ఆశయములు మున్నగు శ్రేష్ఠ గుణములు గలవారని అర్థము.

105. ప్ర. హంస : 'ఆర్య సమాజ' నిర్వచన మేమి ?

ఉ : ఆర్య సమాజ మనగా శ్రేష్ఠ పురుషుల సమాజము. మహర్షి దయానంద సరస్వతి ద్వారా పరోపకారార్థము వైదిక ధర్మ ప్రచార మొనర్చు సంస్థ. ఇది 'ఆర్య సమాజ' మను నామముతో ప్రసిద్ధమై యున్నది. దీని శాఖలు భారతదేశ మందే గాక విదేశము లందును వేల సంఖ్యలో నెలకొల్పబడి యున్నవి. ఇది విశ్వప్రసిద్ధ సంగఠనము.

106. ప్ర. హంస : "పూర్వులు అజామేధ, గోమేధ, అశ్వ నరమేధము లను యజ్ఞములను చేయుచుండెడి వారట. వాసియందు

సఫలవంత మగును. దూరము నుండి ఆశీర్వదించుటలో ఈ మనో వైజ్ఞానిక లాభము అంతగా నుండదు. మన పూర్వు లీ రహస్యమును చక్కగా నెరిగియుండిరి. కావున వారు శిరముపై తమ పవిత్ర వరద హస్తముల నుంచియే ఆశీర్వదించు చుండిరి.

108. ప్ర. హంస : అమ్మా ! నా స్నేహితురాలికి ఎగ్జిమా (Eczema), గుండుగుత్త వ్యాధి (కురుపులు లేచి నీరు కారుచుండు ఒక విధమగు చర్మ వికార వ్యాధి)తో బాధపడుచున్నది. పాప మామె కడు చింతలో నున్నది. నే నామెను చూచుటకు వెళ్ళెదను. నేటి సత్సంగ మింతటితో చాలింతము.

ఉ : అన్నపూర్ణ : ఈ వ్యాధికి ఇంగ్లీషు అలోపతి వైద్యములో సరియగు చికిత్స లేదు. నే నొక చికిత్స చెప్పుదును. దానివల్ల నీ మిత్రురాలి వ్యాధి శీఘ్రముగా, సంపూర్ణముగా తగ్గిపోగలదు. ఒక గాజు లేక పింగాణి పాత్రలో 50 గ్రాముల ఆవనూనె, 50 గ్రాముల చక్కని చిక్కని పెరుగువేసి నాల్గు దినముల వరకు దినమునకు మూడుసార్లు వ్రేలితో చక్కగా కలుపుచుండవలెను. ఐదవ నాటినుండి దినమునకు మూడుసార్లు ఎగ్జిమాపై లేపనము చేయుచుండవలెను. 5, 6 దినములలో ఆ వ్యాధి పూర్తిగా తగ్గిపోగలదు.

మరొక చికిత్స : తుత్తాంజనము అనగా మైలతుత్త భస్మము 5 గ్రాములు, కర్పూరము (క్యాంఫర్) 10 గ్రాములు, కురాసానివాము (ఓమము) 10 గ్రాములు, గొట్టాల గంధకము 10 గ్రాములు. పై నాల్గు వస్తువులు వేర్వేరుగ చక్కగా మర్దించుకొని 50 గ్రాముల మంచి మల్లె నూనెలో కలుపుకొని పూసికొనుచుండిన వ్యాధి పూర్తిగ తొలగి పోగలదు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః